ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY భద్రాద్రి కొత్తగూడెం

BHADRADRI KOTHAGUDEM

బుధవారం, 22 మే 2024

5



	కనిష్ఠం	గరిష్ఠం
ఖమ్మం	20	40.5
భద్రాద్రి	22	40

కదిలిన కర్షకులు





- ఉమ్మడి జిల్లాలో వ్యవసాయ పనులు షురూ..
- ముందస్తు వానలతో దుక్కులు దున్నుతున్న అన్నదాతలు
- ఈ సారి కూడా వరి, పత్తి పంటలకే అధిక ప్రాధాన్యం
- ఖమ్మంలో 7 లక్షలు, భద్రాద్రిలో 4.87 లక్షల ఎకరాల్లో పంటల సాగు
- పత్తి, పచ్చిరొట్ట పంటల సాగుకు సన్నాహాలు

ఖమ్మం వ్యవసాయం, మే 21: ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో వ్యవసాయ పనులు ప్రారంభం అయ్యాయి. ఉపరితల ద్రోణి ప్రభావంతో ముందస్తుగా వర్షాలు కురుస్తుండడంతో రైతులు దుక్కులు దున్నుతున్నారు. విపరీతమైన ఎండలతో ఎండిన దుక్కులను పంట సాగు చేసేందుకు అనువుగా తయారు చేస్తున్నారు. ఇదే సమయంలో వ్యవసాయ శాఖ అధికారులు సాగు విస్తీర్ణం ఆధారంగా విత్తనాలు, ఎరువులను అందుబాటులోకి తీసుకొచ్చేలా ప్రణాళిక చేస్తున్నారు. ఈ ఏడాది సాధారణ వర్షాలు కురిస్తే వానాకాలంలో ఖమ్మంలో 7 లక్షలు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 4.87 లక్షల ఎకరాల్లో పంటలు సాగు అవుతాయని వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. ఈనెల 25 నుంచి రోహిణి కార్తె మొదలు కానుండగా, ఈసారి వర్షాలు ముందే కురుస్తుండడంతో అన్నదాతలు దుక్కులు సిద్ధం చేసుకుంటున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీపై విత్తనాలను అందిస్తుందన్న నేపథ్యంలో రైతులు పచ్చిరొట్ట ఎరువులైన జీలుగు, పిల్లి పెసర, జనుములు జల్లేందుకు సిద్ధం అవుతున్నారు. ఎప్పట్లాగే ఈ ఏడాది కూడా వరి తర్వాత పత్తిని అత్యధిక ఎకరాల్లో సాగు చేస్తారని అంచనా. అన్ని పంటలకు అవసరమయ్యే యూరియా, డీఏపీ, ఎంవోపీ, కాంప్లెక్స్ ఎరువులు కలిపి ఖమ్మం జిల్లాలో 2,24,819, భద్రాద్రిలో 1,01,444 మెట్రిక్ టన్నులు అవసరం అవుతాయని అధికారులు లెక్కలు వేశారు.

పంటల సాగు ఇలా...

వానాకాలంలో ఖమ్మం జిల్లాలో 2,83,943 ఎకరాలోల వరి, మొక్కజొన్న 3,374 ఎకరాలు, కంది 1005 ఎకరాలు, పత్తి 2,01,834 ఎకరాలు, పెసర 15,357, మినుము 436 ఎకరాలు, వేరుశనగ 270 ఎకరాలు, మిరప 88,906 ఎకరాలలో సాగు చేస్తారని వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. ఈ మేరకు 70,965 క్వింటాళ్ల వరి విత్తనాలు, 5 లక్షల 50 వేల పత్తి విత్తన ప్యాకెట్లు, 80ల క్వింటాళ్ల కంది విత్తనాలు అవసరమని ప్రణాళికలు సిద్ధం చేశారు.

భద్రాద్రి జిల్లాలో వరి 1,65,854 ఎకరాలు, కంది 8,348, మొక్కజొన్న 60,200 ఎకరాలు, మిరప 32,168 ఎకరాలు, పత్తి 2,16,625 ఎకరాలు, వేరుశనగ 2,359 ఎకరాలు సాగుచేస్తారని అంచనా వేశారు. దీనికి గాను వరి విత్తనాలు 41,464 క్వింటాళ్ల, కంది 250 క్వింటాళ్ల, మొక్కజొన్న 4,816 క్వింటాళ్లు, పత్తి 5,41,860 ప్యాకెట్లు సిద్ధం చేశారు.

రశీదులు తప్పనిసరి..

వానాకాలం సీజన్‌లో రైతులకు ఇబ్బందులు కలుగకుండా వ్యవసాయ అధికారులు అన్ని చర్యలు తీసుకుంటున్నారు. సరిపడా విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచేందుకు ప్రణాళికలతో ముందుకెళ్తున్నారు. రైతులు లైసెన్స్ ఉన్న ఫర్టిలైజర్ షాపుల్లోనే విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయాలి. రైతులు తప్పనిసరిగా రశీదులు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.



'ఆసరా' ఇచ్చేది ఎన్నడు!?

ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో ఆసరా ఫించన్లు ఎంతో కీలకమైనవి. కుటుంబ సభ్యులు ఆర్థికంగా ఆదుకోకపోయినా ప్రభుత్వం నేరుగా అందించే ఆసరా పింఛన్లపై అనేక మంది బతుకు వెళ్లదీస్తుంటారు. ఆసరా పింఛన్ బ్యాంకు ఖాతాలో జమ అయితేనే ఇంట్లో గాసం వెళ్లే కుటుంబాలు అనేకం ఉన్నాయి. దివ్యాంగులు, వయోవృద్ధులు, ఒంటరి మహిళలు, గీత కార్మికులు, వితంతువులు, చేనేత కార్మికులు, హెచ్ఐవీ, ఫైలేరియా బాధితులు, డయాలసిస్ వ్యాధిగ్రస్తులు ఇలా 9 రకాల వారికి ప్రభుత్వం ఆసరా పింఛన్ అందిస్తోంది. ఆసరా లబ్ధిదారుల్లో దివ్యాంగుల విభాగంలో 90శాతం మంది లబ్ధిదారులు కేవలం ఆసరా పింఛన్ల ఆధారంగా బతుకుతున్నారు. ఇంతటి ప్రాధాన్యం కలిగిన ఆసరా పింఛన్ల కోసం గత రెండేళ్లుగా వేలాదిమంది అర్హులు దరఖాస్తులు సమర్పించి ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం అధికారంలో వున్న కాంగ్రెస్ ప్రభుత్వం నూతన పింఛన్ల మంజూరుకు చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

- రెండేళ్లుగా జాడ లేని నూతన పింఛన్లు
- 20 వేల మంది దరఖాస్తుదారుల ఎదురుచూపులు
- పింఛన్ రాకుండానే గడువు ముగుస్తున్న సదరమ్ ధ్రువపత్రాలు
- ఎంపీడీవో, మునిసిపల్ కార్యాలయాల్లో మూలుగుతున్న దరఖాస్తులు
- బీఆర్ఎస్ సర్కారు హయాం నుంచే నిలుపుదల
- 'చేయూత' పేరుతో నూతన పింఛన్ విధానం ప్రకటించిన కాంగ్రెస్

ఖమ్మం సంక్షేమ విభాగం, మే 21: ఖమ్మం జిల్లాలో ప్రభుత్వం ప్రస్తుతం 1,89,590 మందికి ఆసరా పింఛన్ అందిస్తోంది. వీరిలో వృద్ధులు 72,929 మంది, వితంతువులు 71,702, దివ్యాంగులు 28,554, గీత కార్మికులు 3246, చేనేత 444, హెచ్ఐవీ బాధితులు 2636, డయాలసిస్ 138, ఫైలేరియా 1,412, బీడీ కార్మికులు 2, ఒంటరి మహిళలు 8,527 మంది ఉన్నారు. ప్రభుత్వం ప్రతీ నెల ఆయా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు మొత్తం రూ.43.85 కోట్లు అందిస్తోంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పాడిన తర్వాత అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం తొలి నాళ్లలో ప్రతీ నెల అర్హత కలిగిన లబ్ధిదారులను క్రమపద్ధతిలో ఎంపిక చేస్తూ వచ్చింది. తర్వాత కాలంలో బడ్జెట్ మంజూరు కావటం లేదని నూతన లబ్ధిదారులను ఎంపికను నిలుపుదల చేసింది. తర్వాత 2019జూన్‌లో నూతన పింఛన్లు అందిస్తామని ప్రకటించి అప్పటి వరకు ఆన్‌లైన్‌లో పెండింగ్‌లో ఉన్న వాటిలో అర్హత కలిగిన వారికి నూతన పింఛన్లు మంజూరు చేశారు. తర్వాత 2022 జూన్ నుంచి నూతన పింఛన్లు మంజూరును నిలుపుదల చేశారు. కుటుంబంలో వృద్ధాప్య పింఛన్ పొందుతున్న భర్త మరణిస్తే భార్యకు, భార్య మరణించిన కుటుంబంలో భర్తకు మాత్రమే పింఛన్ బదలాయింపు చేస్తూ ఇన్‌స్టెంట్ పింఛన్‌ను అందిస్తున్నారు. దీంతో రెండేళ్లుగా నూతన పింఛన్లు అందటం లేదు.

అర్హత కోల్పోతున్న సదరమ్ ధృవపత్రాలు

జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ పర్యవేక్షణలో సదరం ధ్రువపత్రాల క్యాంపులను ఏర్పాటు చేసి అర్హత కలిగిన దివ్యాంగులకు వైకల్య పత్రాలను అందిస్తున్నారు. వీరికి ఏడాది కాల పరిమితి నుంచి ఐదేళ్ల కాలపరిమితితో ధ్రువపత్రాలను అందిస్తున్నారు. 2022 జూన్ నుంచి నూతనంగా పింఛన్లు మంజూరు కాకపోవటంతో ఏడాది, రెండేళ్ల కాల పరిమితితో వైకల్య ధ్రువపత్రాలు పొందిన లబ్ధిదారులు... తమ దరఖాస్తులు ఆన్‌లైన్ కాకుండానే ముగిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కార్యాలయాలకే పరిమితమైన దరఖాస్తులు

రెండేళ్లుగా ప్రభుత్వం నూతన పింఛన్లు మంజూరుపై విధానం ప్రకటించక పోవటంతో మంత్రులు, ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు అందజేసిన దరఖాస్తులు స్థానికంగా ఉన్న ఎంపీడీవో కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాల్లో మూలకు చేరాయి. సేకరించిన దరఖాస్తులు కనీసం జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ కార్యాలయానికి చేరటం లేదు. దీంతో జిల్లాలోని ఎంపీడీవో కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాల్లో 20వేలకు పైగా నూతన పింఛన్ దరఖాస్తులు ఆన్‌లైన్ కోసం ఎదురు చూస్తున్నాయి.

దివ్యాంగుల పింఛన్ కోసం దరఖాస్తు చేసి...

ప్రభుత్వం అందించే 9 రకాల పింఛన్లలో దివ్యాంగులకు నెలకు రూ.4016 అందిస్తోంది. మిగిలిన విభాగాల లబ్ధిదారులకు మాత్రం రూ.2016 అందిస్తోంది. అయితే వృద్ధాప్య పింఛన్లు పొందుతున్న లబ్ధిదారులు తమ కొద్దిపాటి వైకల్యం చూపిస్తూ తాత్కాలిక దివ్యాంగ ధ్రువపత్రాలు ఏడాదికి పొందారు. ధ్రువపత్రం గడువు తీరిన తర్వాత మళ్లీ పింఛన్ మంజూరు కాకపోవటంతో పింఛన్ కోల్పోతున్నారు. వృద్ధాప్య పింఛన్ దారులు దివ్యాంగ పింఛన్ పొందేందుకు ఆన్‌లైన్‌లో సర్దుబాటు ఉంది. ఒకసారి దివ్యాంగ పింఛన్ కోల్పోయిన తర్వాత వృద్ధాప్య పింఛన్ తిరిగి పొందేందుకు వీలు లేదు. దీంతో జిల్లాలో 250కి పైగా వృద్ధులు పింఛన్లు కోల్పోయారు. వారి పరిస్థితి ప్రస్తుతం దయనీయంగా మారింది.

'చేయూత' కోసం ఎదురుచూపులు

రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోపుగానే ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేస్తామని వాటిలో భాగంగా వృద్ధులకు చేయూత పథకంలో బాగంగా వృద్ధాప్య ఆసరా పింఛన్‌ను రూ.4వేలకు పెంచుతామని మేనిఫెస్టోలో ప్రకటించారు. ఆరు గ్యారెంటీ పథకాల్లో మిగిలిన వాటిని ప్రారంభించిన రాష్ట్ర ప్రభుత్వం చేయూత పథకంలో భాగంగా వృద్ధాప్య పింఛన్‌ను మాత్రం పెంచలేదు. దీంతో ఆసరా పింఛన్‌ను ఆర్థిక జీవనాధారంగా ఉన్న వృద్ధాప్య పింఛన్ లబ్ధిదారులు రూ.4వేల ఆసరా కోసం ఎదురు చూస్తున్నారు.



ఖమ్మంలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

తీన్మార్ మల్లన్న ప్రశ్నించే శక్తి

వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల

- నిరుద్యోగుల సమస్యలను శాసనమండలిలో వినిపిస్తారు
- ఎమ్మెల్సీ పోరులో భారీ ఆధిక్యతతో గెలిపించాలి
- బోనస్ అంటే తెలియని వారు బోగస్ మాటలు మాట్లాడుతున్నారు
- ఖమ్మం ఎస్ఆర్ కన్వెన్షన్‌లో పట్టభద్రుల ఆత్మీయ సమావేశం

7



మాట్లాడుతున్న కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

ప్రజల పక్షాన పోరాడితేనే నాపై కేసులు

ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న

- కవిత ఏం చేసి జైలుకెళ్లిందో కేటీఆర్ చెప్పాలి
- పల్లా చేతకానితనంతోనే ఉపఎన్నిక వచ్చింది
- బీఆర్ఎస్, బీజేపీలకు ఓటడిగే అర్హత లేదు
- కొత్తగూడెం క్లబ్‌లో పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనం

8

ప్రాభవం కోల్పోయిన మల్బరీ విత్తనోత్పత్తి క్షేత్రం

- ఆదరణ తగ్గడంతో మూలనపడిన నర్సరీలు

6

నకిలీ విత్తన విక్రయాలపై ఉక్కుపాదం

- భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీ రోహిత్‌రాజ్

7



ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో రాజీవ్ గాంధీ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న నాయకులు

రాజీవ్‌గాంధీకి ఘన నివాళి

ఖమ్మం సంక్షేమ విభాగం, మే 21: దివంగత మాజీ ప్రధాన మంత్రి రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో మంగళవారం ఘన నివాళులు అర్పించారు. పార్టీ జిల్లా, నగర అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, జావీద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు తదితరులు రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి రాజీవ్‌గాంధీ సేవలను మననం చేసుకున్నారు. నగర కార్యనిర్వాహక అధ్యక్షుడు నాగండ్ల దీపక్‌చౌదరి తదితరులు పాల్గొన్నారు. అలాగే ఖమ్మంలో నిర్వహించిన పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనంలో రాజీవ్ గాంధీ చిత్రపటానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పూలమాల వేసి నివాళి అర్పించారు. నవ భారత నిర్మాణంలో రాజీవ్‌గాంధీ విశేషంగా కృషి చేసి ప్రజలు, దేశ సమైక్యత కోసం ప్రాణాలను ఆర్పించారని అన్నారు. ఇప్పుడు భారతదేశం సాంకేతికంగా ముందంజలో ఉందంటే దానికి రాజీవ్‌గాంధీ తీసుకున్న విప్లవాత్మకమైన నిర్ణయాలే కారణమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మేయర్ పునకొల్లు నీరజ, కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న, కాంగ్రెస్ లోక్‌సభ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి, జిల్లా, నగర అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, జావీద్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు త్వరగా పూర్తిచేయాలి

- కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి
- పౌర సరఫరాల కమిషనర్ సురేంద్రమోహన్
- ఖమ్మం, కొత్తగూడెంలో సమీక్ష సమావేశాలు



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న సురేంద్రమోహన్, పక్కన కలెక్టర్

ఖమ్మం కార్పొరేషన్/కొత్తగూడెం, మే21 (ఆంధ్రజ్యోతి): యాసంగి సీజన్‌కు సంబంధించిన ధాన్యం కొనుగోళ్లను త్వరగా పూర్తి చేయాలని ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రత్యేక అధికారి, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ సురేంద్రమోహన్ తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోళ్లు చేయాలని ఆదేశించారు. ఇరు జిల్లాల్లో ఆయన మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా తొలుత ఖమ్మం నూతన కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో కలెక్టర్ వీపీ.గౌతమ్‌తో కలిసి ధాన్యం కొనుగోలు, తాగునీటి సరఫరా, అమ్మ ఆదర్శపాఠశాలల పనుల పురోగతి, గనులు, భూగర్భ శాఖల లక్ష్యాలపై సురేంద్రమోహన్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో యాసంగి ధాన్యం దిగుబడి అంచనా, కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరణ, ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద సదుపాయాలను అధికారలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వేసవిలో తాగునీటి సరఫరాకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టిన కలెక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, అధికారులను అభినందించారు. పాఠశాలల పునఃప్రారంభం నాటికి అమ్మఆదర్శ పాఠశాలల పనులు పూర్తికావాలని సూచించారు. ఇసుక అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో కలెక్టర వీపీ. గౌతమ్ మాట్లాడుతూ జిల్లాలో 1.20లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోలు అంచనా ఉండగా ఇప్పటికి 20వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు తెలిపారు. జిల్లావ్యాప్తంగా 157ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయగా 90కేంద్రాల్లోనే కొనుగోళ్లు జరిగినట్లు వివరించారు. మిల్లర్లు, వ్యాపారులు మద్దతు ధర కంటే ఎక్కువ చెల్లించి, కల్లాల్లోనే రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేయటంతో రైతులు కొనుగోలు కేంద్రాలకు రావటం లేదన్నారు. అమ్మ ఆదర్శపాఠశాలల కింద జిల్లాలో 753పాఠశాలల అభివృద్ధికి మంజూరు ఇచ్చామన్నారు. 651 పాఠశాలల్లో పనులు ప్రారంభం కాగా 102 పాఠశాలల్లో ప్రారంభించాల్సి ఉందన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు కే.సత్యప్రసాద్, డి. మధుసూదన్ నాయక్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. (మిగతా 6వ పేజీలో)

24న పాలి సెట్

5 కేంద్రాలు ● 2,591 మంది విద్యార్థులు



ఖమ్మం ఖానాపురం హవేలి, మే 21: రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలల్లో మూడు సంవత్సరాల ఇంజనీరింగ్, నాన్-ఇంజనీరింగ్ డిప్లొమా కోర్సులతో పాటు, వ్యవసాయ డిప్లొమా, వెటర్నరీ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు గాను ఈ నెల 24న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు పాలీసెట్ నిర్వహించనున్నట్లు జిల్లా కో ఆర్డినేటర్ జాకిరాల్లా తెలిపారు. ఈ పరీక్షకు ఖమ్మం నగరంలోని 5 కేంద్రాలలో 2591 మంది విద్యార్థులు హాజరవుతున్నారని తెలిపారు. విద్యార్థులను పరీక్ష కేంద్రం లోనికి గంట ముందుగానే అనుమతిస్తారని, విద్యార్థులు ఉదయం 10 గంటలలోపే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలి తెలిపారు. పరీక్ష ప్రారంభమైన (ఉదయం 11 గం.) తరువాత ఒక్క నిమిషం ఆలస్యం అయినా పరీక్ష కేంద్రంలోకి అనుమతించరని తెలిపారు.

నగరంలోని పరీక్ష కేంద్రాలు

1. ఎస్సార్ అండ్ బీజీఎన్నార్ కళాశాల (940 మంది విద్యార్థులు), 2. స్వర్ణభారతి ఇంజనీరింగ్ కళాశాల (408మంది), 3. కవితా మెమోరియల్ డిగ్రీ కళాశాల (650మంది), 4. డీఆర్ఎస్ డిగ్రీ కళాశాల (446 మంది), 5. బొమ్మ ఇంజనీరింగ్ కళాశాల (147 మంది).

ప్రాభవం కోల్పోయిన మల్బరీ విత్తనోత్పత్తి క్షేత్రం

- ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ అంతటికి సరఫరా
- ఆదరణ తగ్గడంతో మూలనపడిన నర్సరీలు
- 12 ఎకరాలు ఆయిల్‌ఫెడ్‌కు మళ్లింపు
- శిథిలావస్థలో భవనాలు

అశ్వారావుపేట, మే 21: చిన్నసన్నకారు రైతులకు తక్కువ పెట్టుబడి, ప్రభుత్వ ప్రోత్సహంతో అధిక లాభాలను తెచ్చేందుకు అప్పటి ప్రభుత్వం అశ్వారావుపేటలో 1986లో మల్బరీ విత్తనోత్పత్తి క్షేత్రాన్ని ఏర్పాటు చేశారు. ఇందుకోసం ప్రభుత్వం 17 ఎకరాల భూమిని కేటాయించింది. అందులో బోర్లు వేయించి, ఓ కార్యాలయం, సిబ్బంది కోసం నాలుగు క్వార్టర్లను కూడ నిర్మించింది. అప్పట్లో సెరికల్చర్ విభాగం ప్రత్యేకంగా ఉండేది. తెలంగాణ వ్యాప్తంగా మల్బరీ పంటను విస్తరించేందుకు అప్పట్లో చర్యలు చేపట్టారు. అందులో బాగంగా ఉమ్మడి జిల్లాలోని అశ్వారావుపేట, దమ్మపేట మండలంలోని అఖినేపల్లి, గరివెళ్లపాడు, ఖమ్మం ఖానాపురం హవేలీలోను విత్తన ఉత్పత్తి క్షేత్రాలను ఏర్పాటు చేసింది. ఇందుకోసం క్షేత్రస్థాయి నుంచి జిల్లా, రాష్ట్రస్థాయి వరకు పూర్తిస్థాయిలో సిబ్బందిని నియమించారు. రైతులు పండించిన పట్టును కొనుగోలు చేసేందుకు ప్రభుత్వమే



అశ్వారావుపేటలోని మల్బరి పట్టువిత్తనోత్పత్తి క్షేద్రం



ఆయిల్‌ఫెడ్ నర్సరీకి కేటాయించిన మల్బరీ విత్తనోత్పత్తి క్షేత్ర భూమి

ఏపీలోని హనుమాన్ జంక్షన్‌లో, హైదరాబాదులోని తిరుమలగిరిలో, జనగామలో పట్టు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. రైతులు పండించిన పంటలను ఆయా ప్రదేశాలకు తీసుకెళితే బిడ్డర్లు అక్కడకు వచ్చి నాణ్యతను బట్టి వేలంలో పట్టుపురుగులును కొనుగోలు చేసే విదంగా చర్యలు తీసుకోవడంతో అప్పట్లో సెరికల్చర్ ఎంతో వైభవంతో నడిచింది. విత్తనానికి మంచి డిమాండ్ ఉండేది. అశ్వారావుపేటతో పాటు జిల్లాలోని ఇతర క్షేత్రాలు తెలంగాణాకు కావాల్సినంత విత్తనాన్ని ఉత్పత్తి చేసేందుకు చమటోడ్చాల్సివచ్చేది.

ఉద్యానశాఖలో విలీనంతో నిర్వీర్యం..

తదనంతర పరిణామాలలో మల్బరీ విబాగాన్ని ఉద్యానశాఖలో విలీనం చేశారు. ఉద్యానశాఖ అధికారులు సెరికల్చర్‌ను పట్టించుకోకపోవడం, సెరికల్చర్ విభాగంలో అధికారులు, సిబ్బంది నియమకాలు లేక పోవడం, ఇతర ఉద్యాన పంటలు, వాణిజ్య పంటలవైపునకు రైతులు మరలడంతో మల్బరీ పంటకు ఆదరణ తగ్గిపోయింది. మంగళవారం అశ్వారావుపేట మల్బరీ విత్తనోత్పత్తి క్షేత్రాన్ని 'ఆంధ్రజ్యోతి' పరిశీలించినప్పుడు ఒకప్పుడు ఎంతో వైభవంగా ఉన్న క్షేత్రమేనా అన్నట్టు ఉంది నేటి పరిస్థితి. కార్యాలయం కోసం నిర్మించిన భవనం, సిబ్బందికోసం నిర్మించిన భవనాలు పూర్తిగ శిథిలమైపోయాయి. ప్రభుత్వం సెరికల్చర్‌పై తగినస్థాయిలో ప్రోత్సహించకపోవడంతో రైతులు ఇతర పంటలవైపుకు మళ్లారు. దీంతో మల్బరీని వేసే రైతులు తగ్గిపోయారు. సిబ్బంది, బడ్జెట్ లేక పోవడంతో పంటలు వేసేవాళ్ళు లేకుండా పోయారు. కరీంనగర్, వరంగల్, ఖమ్మం, కొత్తగూడెం జిల్లాలో వేళ్ళ మీద లెక్కపెట్టగలిగేంత మంది రైతులు మాత్రమే ఈ పంటను వేస్తున్నారు. దీంతో విత్తనోత్పత్తి క్షే త్రాలకు ఆదరణ తగ్గి వృథాగా పడి వున్నాయి. అశ్వారావుపేట క్షేత్రంలో ప్రతి ఏటా నాలుగైదు ఎకరాల్లో మాత్రమే మొక్కలు నాటుతున్నారు. దానిపై వచ్చిన ఆదాయంతోనే అరకొరకగ క్షేత్ర నిర్వహణ జరుగుతుంది. దీంతో ఈ క్షేత్రంలో నర్సరీలేదని గమనించిన అధికారులు ఆయిల్‌ఫెడ్ నర్సరీలు పెంచడానికోసం ఇందులోని 12 ఎకరాలను ఆయిల్‌ఫెడ్‌కు కేటాయించడాన్ని బట్టి చూస్తేనే సెరికల్చర్ ఎంత నిర్లక్ష్యానికి గురి అవుతుందో అర్థం చేసుకోవచ్చు. క్షేత్రంలో విత్తనాన్ని ఇచ్చే మదర్ ప్లాంట్ కూడ ముదిరి పోవడంతో ప్రస్తుతం దానిని పూర్తిగ తొలగించి వేరే ప్రాంతం నుంచి విత్తనం తెచ్చి మదర్‌ప్లాంట్ పెంచేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

సిబ్బంది లేరు.. నిధులు లేవు..

రామయ్య, సెరికల్చర్ అసిస్టెంట్ అధికారి, అశ్వారావుపేట



సెరికల్చర్ విబాగాన్ని ఉద్యానశాఖలో విలీనం తరువాత సెరికల్చర్ పూర్తిగ వెనుకబడి పోయింది. ఒకప్పుడు వందల ఎకరాలకు ఇక్కడ నుంచి మల్బరీ విత్తనం సరఫరా అయ్యేది. ఇప్పుడు ఈ పంటపై ఎన్నో ప్రోత్సహకాలు ఇస్తున్నా ఆదరణ తగ్గిపోవడంతో అంతంత మాత్రంగానే ఉంది. అశ్వారావుపేట, దమ్మపేట మండలాలకు తానొక్కడినే అధికారిని. ఇతర సిబ్బంది కూడ లేరు. ప్రభుత్వం ప్రోత్సహమిస్తే సెరికల్చర్ ద్వార రైతులకు ఉపాధిని కల్పించవచ్చు. పూర్వ వైభవం తీసుకురావచ్చు.

ఒలంపిక్ సంఘం

ఉమ్మడి జిల్లా సంయుక్త కార్యదర్శిగా సాంబమూర్తి



సాంబమూర్తి

ఖమ్మం స్పోర్ట్స్, మే 21: ఉమ్మడి జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ నూతన జాయింట్ సెక్రటరీగా జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ సెక్రటరీ ఓలేటి సాంబమూర్తిని ఎన్నుకున్నారు. నగరంలోని జూబ్లీక్లబ్‌లో జరిగిన ఒలంపిక్ సంఘం జనరల్‌బాడీ సమావేశంలో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆయన ఎంపికపై జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు బాలసాని విజయ్‌కుమార్, సంఘ సభ్యులు డాక్టర్‌లు కూరపాటి ప్రదీప్‌కుమార్, ప్రవీణ్, సుమంత్, కొండా శ్రీధర్, రాయల సతీష్, పరిటాల చలపతి, పలు క్రీడా సంఘాల ప్రతినిధులు అభినందించారు.

26న అథ్లెటిక్స్ ఎంపికలు

ఖమ్మం స్పోర్ట్స్, మే 21: జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 26న ఖమ్మం నగరంలోని సర్ధార్‌పటేల్ స్టేడియంలో అండర్- 08, 10, 12, 14, 16, 18, 20 బాలురు, బాలికల, పురుషులు, మహిళల అథ్లెటిక్స్ ఎంపికలు నిర్వహించనున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి ఎండీ షఫీక్‌అహ్మద్ ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపికల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎంపికచేసి త్వరలో వరంగల్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు పంపుతామని తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు తమ జనన ధృవీకరణ పత్రంతో ఉదయం 8 గంటలకల్లా స్టేడియానికి చేరుకోవాలని కోరారు.

ఒకేషనల్ కోర్సు విద్యార్థులకు క్లినికల్ శిక్షణ

ఖమ్మం ఖానాపురంహవేలి మే 21: ఖమ్మం జిల్లాలో ఇంటర్ ల్యాబ్ టెక్నీషియన్ ఒకేషనల్ కోర్సులో మార్చి-2019 సంవత్సరం నుంచి ఉతీర్ణులైన విద్యార్థులకు ఒక సంవత్సరం క్లినికల్ శిక్షణ జిల్లాలోని ఏరియా ఆసుపత్రులు, కమ్యూనిటీ ఆసుపత్రులలో ఇస్తామని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కె రవిబాబు తెలిపారు. ఈ శిక్షణకు ఎంపికైన విద్యార్థులు మాత్రమే రు.1000లు ఆసుపత్రి పేరు మీదా డీడీ రూపంలో చెల్లించాలన్నారు. గతంలో దరఖాస్తు చేసుకోని, ఎంపిక కానీ వారు కూడా తాజాగా దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు తమ బయోడేటా ఫారంతో పాటు రు.10 లు పోస్టల్ స్టాంప్లు అతికించిన సొంత చిరునామా గల కవరును జతపర్చాలని తెలిపారు. సంబంధిత సర్టిఫికేట్సు జిరాక్సు కాపీలను కూడా జతపరచి జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కార్యాలయం, కొత్త కలెక్టరేట్, ఖమ్మం నందు జూన్ 1 సాయంత్రం ఐదు గంటలలోపు అందించాలని తెలిపారు.

యోగానంద లక్ష్మీనరసింహస్వామి

కల్యాణానికి అంకురార్పణ

- నేడు నృసింహ జయంతి
- రేపు కల్యాణం

భద్రాచలం, మే 21: భద్రాచలంలోని శ్రీ యోగానంద లక్ష్మీనరసింహస్వామి వార్షిక తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలకు మంగళవారం అంకురార్పణ జరిగింది. శ్రీ సీతారామచం ద్రస్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన యోగానంద లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో మంగళవారం ఉదయం స్వామి వారికి పంచామృతాభిషేకం నిర్వహించారు. సాయంత్రం విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, రుత్విక్ గ్వరణం, మృత్సంగ్రహణం, అంకురారోపణం, వాస్తుహోమం నిర్వహించారు. పంచాహ్నిక తిరు కల్యాణ మహోత్సవాల్లో పాల్గొనే వైదిక సిబ్బందికి దీక్ష వస్త్రాలను దేవస్థానం పర్యవేక్షకులు లింగాల సాయిబాబా అందజేశారు. బుధవారం నరసింహ స్వామి జయంతిని పురస్కరించుకొని అభిషేకం నిర్వహించను న్నారు. అలాగే అగ్ని ప్రతిష్ఠ ద్వజారోహణం, ఎదుర్కో లు ఉత్సవం, గరుడ వాహనంపై తిరువీధి సేవ నిర్వహించనున్నారు. గురువారం యోగానంద లక్ష్మీనరసింహస్వామి వారి కల్యాణం నిర్వహించనున్నా రు. ఈ కార్యక్రమా ల్లో ప్రధాన అర్చకులు అమరవాది విజయరాఘవన్, ఉప ప్రధాన అర్చకులు అమరవాది శ్రీనివాస రామానుజం, అర్చకులు సౌమిత్రి శ్రీనివాసాచార్యులు, అమరవాది వెంకట్రామన్, వేద పండితులు వేణుతుల ఆంజనేయ వరప్రసాద్ శర్మ పాల్గొన్నారు.

ఆరోగ్యప్రదాయిని సొక్కు బుర్ర

- వినియోగిస్తున్న ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్



సొక్కు బుర్రలో నీళ్లు తాగుతున్న పీవో ప్రతీక్‌జైన్

భద్రాచలం, మే 21: ప్రస్తుత సమాజంలో స్వచ్ఛమైన గాలి, నీరు, ఆహారం లభించని పరిస్థితి నగరాలు, పట్టణాల్లో నెలకొని ఉంది. ఏజెన్సీ ప్రాంతాల్లో నివసించే వారికి ఇందులో కొంత మినహాయింపు ఉంటోంది. కారణం ఆరోగ్యం, శుచి, శుభ్రతకు ప్రాధాన్యమిస్తూ భద్రాచలం ఏజెన్సీలో నివసిస్తున్న ఆదివాసీలు తరతరాలుగా వారసత్వ సంపదగా పురాతన కాలం నుంచి వస్తున్న ఆహారపు అలవాట్లను కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో ప్రస్తుత ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్ వీరిని స్ఫూర్తిగా తీసుకొని సొక్కుబుర్ర (సొరకాయ బుర్ర)లో తాగునీటిని నింపుకొని ప్రతి రోజు ఉపయోగిస్తున్నారు. అంతేకాదు అధికారులతో సమావేశాల సమయంలో సొక్కుబుర్ర ప్రాధాన్యతను తెలుపుతూ అందులో నీరు తాగాలని వారికి సూచిస్తున్నారు. ఇటీవల పీవో ప్రతీక్‌జైన్ కుటుంబ సభ్యులు ఐటీడీఏ ప్రాంగణంలోని గిరిజన మ్యూజియంను సందర్శించారు. ఈ సమయంలో ఆదివాసీలు పురాతన కాల ం నుంచి వినియోగిస్తున్న వివిధ పనిముట్లు, ఆహారపు అలవాట్లను వారి కుటుంబ సభ్యులు తెలుసుకున్నారు. ఈ సమయంలో సొరకాయ బుర్ర వినియోగం దాని వలన లాభాలు తెలుసుకున్నారు. ఈ క్రమంలో ఆయన సొరకాయ బుర్ర గురించి మరింతగా గూగుల్‌లో సమాచారం సేకరించినట్లు తెలిసింది. దీంతో ఆయన ఈ వేసవి కాలంలో సొక్కుబుర్రలోని నీటినే తాగుతుండటం జరుగుతోంది. అలాగే తాను టూర్‌కు వెళ్లిన క్రమంలో తన వెంట సొక్కుబుర్రను తీసుకెళ్తున్నారు. ఇదిలా ఉండగా ఇటీవల పీవో ప్రతీక్‌జైన్ జావ, గటకఅన్నం రుచి చూసినట్లు తెలుస్తోంది. కాగా మరో రెండు సొక్కుబుర్రలను సిద్ధం చేయాలని పీవో మ్యూజియం అధికారులకు సూచించినట్లు సమాచారం.

ఎమ్మెల్సీ ఓటు వేద్దాం ఇలా..

- ఈవీఎంలో ఉండవు బ్యాలెట్ పత్రాలపైనే ఓటింగ్
- ప్రాధాన్య ఓట్ల విధానం

ఎందరికైనా ఓటు వేయవచ్చు

ఇల్లెందు, మే 21: పన్నెండు జిల్లాల పరిధిలో విస్తరించబడిన పూర్వ నల్గొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాల పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గం ఎన్నికలు ఆసక్తికరంగా మారాయి. సాదారణంగా శాసనసభ, లోక్‌సభ, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఒక్కో ఓటరు ఒక్క అభ్యర్థికి మాత్రమే ఓటు వేయాల్సివుండగా శాసనమండలి పట్టభద్రుల ఎన్నికల్లో ఒక్కో ఓటరు ప్రాధాన్య క్రమంగా ఎందరికైనా ఓట్లువేసే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో ఓటరు తప్పనిసరిగా మొదటి ప్రాధాన్య ఓటు ఇవ్వాల్సి ఉంటుంది. మొదటి ప్రాధాన్య ఇవ్వని బ్యాలెట్ పత్రాలను ఓట్లలెక్కింపులో పరిగణలోకి తీసుకోరు. అయితే ప్రాధాన్య ఓట్లువేసే శాసన మండలి ఎన్నికల్లో ఈవీఎంలో ఉండవు కేవలం బ్యాలెట్ పేపర్ మాత్రమే వుంటుంది. పోలింగ్ అధికారి ఇచ్చే పెన్నుతోనే ఓటువేయాల్సి ఉంటుంది. బ్యాలెట్ పేపర్‌లో పోటీ చేస్తున్న అభ్యర్థులకు ఎదురుగా ఉన్న బాక్స్‌ల్లో ప్రాధాన్య క్రమంలోనే ఓటు వేయాల్సి ఉంటుంది. అయితే ఓటరు ఒక్కరికి లేదా కొందరికి ప్రాధాన్య అంకెలు వేస్తూ ఓటు వేయాల్సి ఉంటుంది. ఇది ఓటరు ఇష్టాఇష్టాలపై ఆధారపడిఉంటుంది. బ్యాలెట్ పేపర్‌పై కేవల 1,2,3,4,5 ఇలా అంకెలు మాత్రమే రాయాల్సి ఉంటుంది. అందుకు భిన్నంగా టిక్ కొట్టడం, రోమన్ అంకెలు వేయడం, ఇంటు మార్కులు వేయడం, అక్షరాల్లో ఒకటి, రెండు, మూడు, నాలుగు, ఐదు రాయడం లేదా వన్, టూ, త్రీ, ఫోర్ అని ఆంగ్లంలో రాయడం, బ్యాలెట్ పేపర్‌పై సంతకం చేయడం, ఇతర రాతలు రాయడం, ఒక అభ్యర్థికి ఇచ్చిన ప్రాధాన్య ఓటు మరొక అభ్యర్థికి కూడ ఇవ్వడం, ఒక అభ్యర్థికే రెండు నెంబర్లు వేయడంలాంటి పనులు చేస్తే ఆ బ్యాలెట్ చెల్లుబాటు కాదు. ఒక ఓటరు బ్యాలెట్ పత్రంపై వున్న అభ్యర్థులందరికీ (పోటీలో ఉన్నవారు) 1,2,3,4 అంటూ ఎందరికైనా వరుసక్రమంలో ప్రాధాన్య ఓట్లు వేసే అవకాశం వుంటుంది. అందువలన ఇతర సాధారణ ఎన్నికల మాదిరిగా ఓటు ముద్ర వేయడం కాకుండా పోలింగ్ అధికారి ఇచ్చిన పెన్నుతోనే ప్రాధాన్యతలో గాని లేదా ఒక్కరికి గాని ఓటువేయాల్సి ఉంటుంది.

పన్నెండు జిల్లాల్లో పట్టభద్రుల నియోజకవర్గం: శాసన మండలి నల్గొండ, ఖమ్మం, వరంగల్ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం విభజనకు గురైన 12జిల్లాల పరిధిలో వుండటం గమనార్హం. మొత్తం 4,61,806 మంది పట్టభద్రులు ఓటు హక్కు కలిగి వున్నారు.

జిల్లాల వారిగా ఓటర్ల వివరాలు ఇలా వున్నాయి

జిల్లా పేరు	పురుషులు	మహిళలు	థర్డ్‌జండర్	మొత్తం
కొత్తగూడెం	22,486	17,412	0	39,898
ఖమ్మం	50,517	33,085	4	83,606
నల్గొండ	51,370	29,189	0	80,559
సూర్యపేట	34,043	17,250	0	51,293
యాదాద్రి భువనగిరి	20,740	13,186	0	33,926
భూపాలపల్లి	7,956	4,504	0	12,460
ములుగు	6,558	3,679	0	10,237
మహబూబాబాద్	22,842	11,817	0	34,759
వరంగల్	26,907	16,687	0	43,594
హనుమకొండ	25,608	17,875	0	43,483
జనగామ	14,862	8,457	1	23,329
సిద్దిపేట	3,118	1,553	0	4,671
మొత్తం	2,87,007	1,74,784	5	4,61,806

తీన్మార్ మల్లన్నను గెలిపించాలి

- కాంగ్రెస్ పట్టభద్రుల అభ్యర్థితో కలిసి వైరా ఎమ్మెల్యే రాందాస్ ప్రచారం



మాట్లాడుతున్న తీన్మార్ మల్లన్న

వైరా, మే 21: ఈనెల 27న జరిగే పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను భారీ మెజార్టీతో గెలిపించాలని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ పట్టభద్రులకు పిలుపునిచ్చారు. తీన్మార్ మల్లన్న విజయాన్ని కాంక్షిస్తూ మంగళవారం రాత్రి వైరాలో నిర్వహించిన పట్టభద్రుల కాంగ్రెస్ శ్రేణుల సమావేశాల సమావేశంలో ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, అభ్యర్థి తీన్మార్ మల్లన్న, ఖమ్మం కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రామసహాయం రఘురామిరెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ పాల్గొని ప్రసంగించారు. పట్టభద్రులకు కాంగ్రెస్‌తోనే మేలు జరుగుతుందని పేర్కొన్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కాంగ్రెస్‌తోనే సాధ్యమని స్పష్టం చేశారు. పల్లా రాజేశ్వర్‌రెడ్డి అసమర్థత వలనే ఎమ్మెల్సీ ఉప ఎన్నిక వచ్చిందని విమర్శించారు. పట్టభద్రులను పల్లా మోసం చేశారని ఆక్షేపించారు. కేటీఆర్ వ్యాఖ్యలు దెయ్యాలు, వేదాలు వల్లించిన చందంలా ఉన్నాయని ఎద్దేవా చేశారు. తీన్మార్ మల్లన్నను గెలిపించి పట్టభద్రులు తమకు ఒక అండను తెచ్చుకోవాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, ఏదునూరి సీతరాములు, జడ్పీటీసీ నంబూరి కనకదుర్గ, మునిసిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ కేంద్రం పరిశీలన

- పోలింగ్ కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలి: భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక



కొత్తగూడెం డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

కొత్తగూడెం, మే 21 (ఆంధ్రజ్యోతి): వరంగల్, ఖమ్మం, నల్గొండ శాసనమండలి పట్టభద్రుల ఉప ఎన్నిక పోలింగ్ నిర్వహణ కోసం సిబ్బందికి ఎన్నికల సామగ్రి పంపిణీ నిమిత్తం కొత్తగూడెంలోని శ్రీరామచంద్ర సైన్స్ అండ్ ఆర్ట్స్ కాలేజీలో ఏర్పాటుచేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రియాంక మంగళవారం సందర్శించారు. కలెక్టర్ మాట్లాడుతూ 55పోలింగ్ కేంద్రాలకు మొత్తం 312మంది ఎన్నికల సిబ్బందిని కేటాయించామని దానిలో పీవోలు 76, ఏపీవోలు 76, ఓపీవోలు 160మంది ఉన్నారని తెలిపారు. ఈనెల 26న డిస్ట్రిబ్యూషన్ సెంటర్, 27న రిసిప్షన్ సెంటర్ ఇక్కడే ఉంటుందని తెలిపారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో తాగునీటి వసతి, వైద్యశిబిరం, అల్పాహారం, భోజన వసతి, షామియానాలు ఇతర వస్తువులు ఏర్పాటుచేయాలని, ఎలాంటి లోటుపాట్లు, గందరగోళానికి తావు లేకుండా సిబ్బందికి పోలింగ్ సామగ్రిని పక్కాగా అందించాలన్నారు. చెక్‌లిస్టు ఆధారంగా ఎన్నికల నిర్వహణకు అవసరమైన సామగ్రి అందిందా లేదా అనేది సరిచూసుకోవాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఓటింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు నిర్వహించే పోలీసులు, సిబ్బందిని తరలించేందుకు వాహనాలను సిద్ధం చేయాలన్నారు. సకాలంలో నిర్దేశిత పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది చేరుకునేలా పర్యవేక్షణ జరపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా తమ దృష్టికి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎలక్షన్ సూపరింటెండెంట్ దారా ప్రసాద్, తహసీల్దార్ పుల్లయ్య, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ రంగా ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

24 నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

ఖమ్మం ఖానాపురంహవేలి మే 21: ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ఈ నెల 24 నుంచి జూన్ 3 వరకు జరుగుతాయని డీఐఈవో రవిబాబు తెలిపారు. పరీక్షల ఏర్పాట్లపై మంగళవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల, నయాబజార్‌లో చీఫ్ సూపరింటెండెంట్లకు, డిపార్టమెంటల్ ఆఫీసర్లకు, కస్టోడియన్లకు పూర్తిస్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. డీఐఈవో మాట్లాడుతూ జిల్లాలో 42 పరీక్షా కేంద్రాలలో మొదటి సంవత్సరం 10352 మంది విద్యార్థులు, ద్వితీయ సంవత్సరం 4632 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు అవుతున్నారని, పరీక్షలు ఉదయం 9.00 గంటల నుంచి 12.00 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో డీఈసీ సభ్యులు వెంకటేశ్వరరావు, బి. వీరభద్రరావు, చీఫ్ సూపెరింటెండెంట్లు, డిపార్‌మెంట్ ఆఫీసర్లు, కస్టోడియన్లు ఇతర అధికారులు పాల్గొన్నారు.

జూన్ 3 నుంచి పదోతరగతి సప్లిమెంటరీ పరీక్షలు

ఖమ్మం ఖానాపురంహవేలి మే 21: 2024 పదోతరగతి అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలు జూన్ 3 నుంచి 11 వరకు నిర్వహిస్తున్నట్లు డీఈవో సోమశేఖర శర్మ తెలిపారు. ఈ పరీక్షలు తెలుగు ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:50 వరకు, హింది, ఆంగ్లం, గణితం, సోషల్ ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు నిర్వహిస్తారన్నారు.. మిగిలిన సైన్స్ , పరీక్షలు ఉదయం 9:30 గంటల నుంచి 11 గంటల వరకే జరుగుతాయని తెలిపారు. ఇంత వరకు పరీక్ష ఫీజు చెల్లించని వారు జూన్ 1వ తేదీలోగా ఆలస్య రుసుం రూ:50తో కలిపి చెల్లించాలని తెలిపారు.

ధాన్యం కొనుగోళ్లు త్వరగా పూర్తిచేయాలి

(5వ పేజీ తరువాయి)

నెలాఖరులోగా ధాన్యం కొనుగోళ్లు పూర్తిచేయాలి

కొత్తగూడెం కలెక్టరేట్‌లో జరిగిన సమీక్ష సమావేశంలో ప్రత్యేక అధికారి సురేంద్రమోహన్ మాట్లాడుతూ నెలాఖరులోగా ధాన్యం కొనుగోలు ప్రక్రియను పూర్తిచేయాలని ఆదేశించారు. ఇప్పటివరకు జరిగిన ధాన్యం కొనుగోలు ప్రక్రియపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. అకాల వర్షాల వల్ల ధాన్యం తడవకుండా టార్పాలిన్లను అందుబాటులో ఉంచాలని మార్కెటింగ్ అధికారులను ఆదేశించారు. ధాన్యంలో తేమశాతం ఉన్నా కొనుగోలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక అలా మాట్లాడుతూ జిల్లాలో 136కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తున్నామన్నారు. లక్షా 33వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటివరకు లక్షా 24వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 2081మంది రైతుల నుంచి కొనుగోలు చేశామన్నారు. దీనికిగానూ రూ.24కోట్లు రైతులకు జమ చేసినట్లు కలెక్టర్ వివరించారు. అనంతరం జిల్లా ప్రత్యేక అధికారి సురేంద్రమోహన్ సుజాతనగర్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. తరువాత స్థానికంగా ఉన్న పారాబాయిల్డ్ రైస్‌మిల్లును సందర్శించి ధాన్యాన్ని వెంటనే దిగుమతి చేసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, డీఆర్‌డీవో విద్యాచందన, జిల్లా సివిల్‌సప్లయి అధికారి రుక్మిణి, జిల్లా వ్యవసాయ అధికారి బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగుల సమస్యలు పరిష్కరిస్తా

- అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న పార్టీలను ఓడించండి
- బీజేపీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డి



ఓట్లు అభ్యర్థిస్తున్న బీజేపీ అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డి

లక్ష్మీదేవిపల్లి/మణుగూరు టౌన్, మే 21: ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిపిస్తే నిరుద్యోగుల సమస్యలను పరిష్కరిస్తానని, అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల అభ్యర్థులను ఓడించాలని వరంగల్, నల్గొండ, ఖమ్మం పట్టభద్రుల నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి కోరారు. మంగళవారం కొత్తగూడెంలోని ప్రకాశం మైదానంలోని వాకర్స్‌ను, సింగరేణి ప్రధాన కార్యాలయం, కోర్టు ప్రాంగణాల ఎదుట ఉద్యోగులు, పట్టభద్రులను కలిసి తనకు మొదటిప్రాధాన్య ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్‌కు రాష్ట్రంలో ఓటు అడిగే హక్కు లేదని, పల్లా రాజేశ్వర్‌రెడ్డి రాజీనామా చేసి పట్టభద్రుల ఓట్లను నిర్వీర్యం చేశారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రజలకు ఆరు గ్యారెంటీల వాగ్ధానాలతో గద్దెనెక్కి ఏఒక్కటీ పూర్తిగా అమలుచేయకుండా అవినీతి, అసమర్థత గల వ్యక్తిని ఎమ్మెల్సీ అభ్యర్థిగా నిలబెట్టి ఓటు అడగడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం అన్ని రాష్ట్రాల్లో అభివృద్ధి చెందిందని, అన్నివర్గాల ప్రజలకు ముద్ర రుణాలు, లక్షలాదిమంది నిరుద్యోగులకు ఉద్యోగాలను కల్పించిందని గుర్తుచేశారు. ఒకటో నెంబర్‌పై మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపిస్తే పట్టభద్రుల సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ ప్రచారంలో ఆయన వెంట బీజేపీ జిల్లా అధ్యక్షుడు కేవీ.రంగా కిరణ్, మాజీ పార్లమెంట్ సభ్యుడు అజ్మీరా సీతారాంనాయక్, అసెంబ్లీ ప్రభావి కొడగంటి రమేష్, నాయకులు జీవీకే.మనోహర్, ఆకుల నాగేశ్వరరావుగౌడ్, టి.నరేంద్రబాబు, రాయుడు నాగేశ్వరరావు, బీఎంఎస్ నాయకులు మాదవ్‌నాయక్, పవన్‌కుమార్, ఆర్‌ఎస్‌ఎస్ పిల్లి రాజేశ్వరరావు, పైడిపాటి రవీందర్, శ్రీధర్‌యాదవ్, బైరి నిర్మల ఉన్నారు.

న్యాయవాదులను ఓట్లు అభ్యర్థించిన ప్రేమేందర్‌రెడ్డి

మణుగూరుటౌన్: ఖమ్మం, వరంగల్, నల్గొండ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డి మణుగూరు పట్టణంలో మంగళవారం విస్తృతంగా ప్రచారాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా మణుగూరు బార్ అసోసియేషన్ న్యాయవాదులను, సింగరేణి జీఎం కార్యాలయ ఉద్యోగులను, ప్రభుత్వ అధికారులను, ఉద్యోగులను పట్టభద్ర ఎమ్మెల్సీ ఓటర్లను కలుసుకుని ఓట్లు అభ్యర్థించారు. ఆయన మాట్లాడుతూ.. తొలి ప్రాధాన్యత ఓటును తనకే వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మహబూబాబాద్ ఎంపి అభ్యర్థి సీతారామ్ నాయక్, నాయకులు రంగాకిరణ్, పోడియం బాలరాజు, జంపన సీతారామరాజు, పున్నం భిక్షపతి, చిర్రా సరస్వతి, లింగంపల్లి రమేష్, కుంజా రామకృష్ణ, నాగమణి, బ్రహ్మం, నాగేశ్వరరావు, వెంకట్, ఎం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు

రైతులను మోసం చేసిన కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలి

- ఎమ్మెల్సీ తాతా మధుసూదన్
- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థిని గెలిపించాలని వినతి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తాతా మధుసూదన్

ఖమ్మంకార్పొరేషన్, మే 21: రైతులను మోసం చేసిన కాంగ్రెస్‌కు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల ముందు హామీలు ఇచ్చి, పార్లమెంట్ ఎన్నికల తరువాత మాటలు మారుస్తున్నారని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించారు. వరిధాన్యా నికి క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తామని స్వయంగా ముఖ్యమంత్రి ప్రకటించగా, కేవలం సన్నవడ్లకు మాత్రమే రూ.500 బోనస్ ఇస్తామని రెవెన్యూ మంత్రి ప్రకటిస్తున్నారన్నారు. రాష్ట్రంలో దొడ్డు వడ్లు పండించే రైతులు 80శాతం ఉంటే, కేవలం తమ అవసరాలకోసం 20శాతం మంది రైతులు సన్నవడ్లు పండిస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం 80శాతం మంది రైతులకు బోనస్ ఇవ్వకుండా ఎగనామం పెట్టేందుకు ప్రయత్నిస్తున్నదన్నారు. అకాల వర్షానికి దెబ్బతిన్న వరిధాన్యాన్ని కొనే దిక్కులేకుండా పోయిందన్నారు. రైతుకు రూ.2లక్షల రుణమాఫీ కూడా సాధ్యంకాదని ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ పేర్కొన్నారు. ఒక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి, దానిద్వారా రుణం తీసుకొని రైతులకు రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం మరోసారి రైతులను మోసం చేసేందుకు సిద్ధమయిందన్నారు. ఏ కార్పొరేషన్‌కైనా రిజర్వ్‌బ్యాంక్ నిబంధనలకు లోబడే రుణం వస్తుందని అడిగినంత ఇవ్వరన్నారు. దీంతో రుణమాఫీకి సంబంధించి, రైతులకు ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయటం సాధ్యంకాదన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వహయాంలో రైతులు వ్యవసాయంపై ఎంతో ఆసక్తి చూపించేవారని, పదేళ్లక్రితం 60వేల మెట్రిక్‌టన్నుల ధాన్యంపండితే, బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో 3లక్షల మెట్రిక్‌టన్నులకు దిగుబడి చేరిందన్నారు. అప్పటి సీఎం కేసీఆర్ సాగునీటి నిల్వలు పెంచేందుకు చర్యలు చేపట్టడంవల్లే ఇది సాధ్యమైందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం 150రోజులు పాలనలో రైతుల స్థితి అగమ్యగోచరంగా మారిందన్నారు. అందుకే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధిచెప్పాలన్నారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా రైతుబిడ్డ రాకేష్‌రెడ్డికి కేసీఆర్ అవకాశం ఇస్తే, బ్లాక్‌మెయిలర్ తీన్మార్ మల్లన్నకు కాంగ్రెస్ టికెట్ ఇచ్చిందని మధుసూదన్ ఆరోపించారు. తీన్మార్ మల్లన్నను గెలిపిస్తే శాననమండలి గౌరవం పోతుందన్నారు. రియల్ ఎస్టేట్. కళాశాల యాజమాన్యాలను బెదిరించి, బ్లాక్‌మెయిల్ చేసిన కేసులు తీన్మార్ మల్లన్నపై ఉన్నాయని, రైతుబిడ్డ, ఉన్నత విద్యావంతుడు రాకేష్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. విలేకరుల సమావేశంలో డీసీసీబీ మాజీచైర్మన్ కూరాకుల నాగభూషయ్య, ఖమ్మం రూరల్, రఘునాధపాలెం మండల బీఆర్‌ఎస్ అధ్యక్షులు బెల్లం వేణు, వీరూనాయక్, ఉద్యమకారులు పాల్గొన్నారు.

తీన్మార్ మల్లన్న ప్రశ్నించే శక్తి

- విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యలను శాసనమండలిలో వినిపిస్తారు
- బోనస్ అంటే తెలియని వారు బోగస్ మాటలు మాట్లాడుతున్నారు
- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

ఖమ్మం, మే 21(ఆంధ్రజ్యోతిప్రతినిధి): రాష్ట్రంలో ప్రశ్నించి సాధించే శక్తి తీన్మార్ మల్లన్న అని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. అటువంటి మల్లన్నను పట్టబద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భారీ ఆధిక్యతతో గెలిపించే బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఖమ్మంలోని ఎస్ఆర్ కన్వెన్షన్ హాల్‌లో మంగళవారం కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న విజయం కోసం నిర్వహించిన ప్రచార సమావేశంలో మంత్రి తుమ్మల ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. రాష్ట్ర విస్తీర్ణంలో సగ భాగంగా నల్లగొండ, వరంగల్, ఖమ్మం పట్టబద్రుల నియోజకవర్గం ఉందని, ఈ ప్రాంతానికి మల్లన్న వంటి ప్రజాప్రతినిధుల అవసరం ఉందన్నారు. నిరుద్యోగులు, ఉద్యోగులు, విద్యార్థులు, పేదల సమస్యలను ఆయన శాసనమండలి ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చి వాటిని పరిష్కరించే శక్తి మల్లన్నకు ఉదన్నారు. అందుకే గత ఎన్నికల్లోనూ అత్యధిక ప్రజలు మల్లన్నవైపు మొగ్గుచూపారన్నారు. ఆ ఎన్నికల్లో సాంకేతికంగా ఓడినా నైతికంగా గెలిచారన్నారు. ఈసారి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజల అండతో భారీ ఆధిక్యతతో విజయం సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆయన గెలుపుకంటే మెజారిటీనే ముఖ్యమన్నారు.

గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చి, పాలనను విచ్ఛిన్నం చేసిందన ఆరోపించారు. కష్టాలు, నష్టాలు ఎన్ని ఉన్నా రేంత్‌రెడ్డి ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకునేందుకు అన్ని గ్యారంటీలను అమలు చేస్తోందన్నారు. రాష్ట్రంలో పేదలకు రేషన్‌లో బియ్యం, బడిపిల్లలకు మధ్యాహ్నం భోజనం, సంక్షేమ హాస్టళ్లకు సన్న బియ్యం అదించేందుకు ముందుగా సన్న వడ్లు పండించే రైతులకు రూ.500 బోనస్ ఇవ్వాలని క్యాబినెట్ మీటింగ్‌లో ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. వాస్తవానికి సన్నవడ్లు సాగు చేసే రైతులకు దిగుబడి తక్కువగా పెట్టుబడి ఎక్కువగా ఉంటుందని నష్టం కూడా ఉంటుందని అందుకే మొదటి ప్రాధాన్యతగా వారికి బోనస్ ఇచ్చిన తర్వాత దశల వారీగా అన్నిరకాల వడ్లు సాగు చేసే రైతులకు అందించాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. కానీ బోనస్ అనే పదానికి అర్థం తెలియని వ్యక్తులు, నాయకులు, పార్టీలు బోగస్ విమర్శలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వం పుట్టి ఆరు నెలలైనా కాకముందే విపక్షాలు ఏడుస్తున్నాయన్నారు.

సమావేశంలో ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ ప్రజలకోసం పోరాడినందుకే గత ప్రభుత్వం తనపై పెట్టిన తప్పుడు కేసులు పెట్టిందన్నారు. అటువంటి కేసులను పట్టుకుని కేటీఆర్ దుష్ప్రచారం చేస్తుంటే ప్రజలు సహించరని తెలిపారు. అధికార పార్టీలో ఉన్నా ప్రజలు, నిరుద్యోగులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకుంటానని తెలిపారు. 2లక్షల ఉద్యోగాలు ఇస్తామని మోసం చేసిన కేసీఆర్‌కు ఓటు అడిగే అర్హత లేదన్నారు.

సమావేశంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నగర అధ్యక్షుడు జావీద్, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రఘురాంరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, నూకల నరేష్‌రెడ్డి, ప్రైవేటు విద్యాసంస్థల చైర్మన్ మువ్వా శ్రీనివాసరావు, ఆమ్ ఆద్మీ పార్టీనాయకులు నల్లమోతు తిరుమలరావు సీపీఐ నాయకులు జానిమియా, కాంగ్రెస్ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు శరత్‌కుమార్‌రెడ్డి, మేయర్ పునుకొల్లు నీరజ, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహర, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్, బీజేపీలకు.. ఆ హక్కు లేదు

- ప్రజలకు ఏమీ చేయకుండా ఓట్లు ఎలా అడుగుతారు..?
- ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో తీన్మార్ మల్లన్న గెలుపు ఖాయం
- కేసీఆర్ అరాచకాలను ప్రశ్నించినందుకు హింసించారు
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న తీన్మార్ మల్లన్న

ఖమ్మం రూరల్, మే 21: ఖమ్మం, నల్గొండ, వరంగల్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీలకు ఓటు అడిగే నైతిక హక్కులేదని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఖమ్మం రూరల్ మండలంలోని టీసీవీ రెడ్డి ఫంక్షన్ హాలులో మంగళవారం పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ప్రసంగించారు. తీన్మార్ మల్లన్నపై 100 కేసులు ఉన్నాయని బీఆర్ఎస్ వారు అంటున్నారని, గత ముఖ్యమంత్రి నియంత పోకడను, ప్రభుత్వ అరాచకాలను ప్రశ్నించినందుకు, వేలెత్తి చూపినందుకే అక్రమ కేసులు బనాయించారన్నారు. కేసీఆర్‌కు ఇంగిత జ్ఞానం లేదని ఆయన తీరును సమాజం హర్షించదని తెలిపారు. గత ఎన్నికల్లోనే తీన్మార్ మల్లన్న గెలిచేవాడని, గట్టి పోటీ ఇచ్చారని కేసీఆర్ తిమ్మిని బమ్మి చేసి గట్టెక్కారని విమర్శించారు. ఈ ఉప ఎన్నిక బీఆర్ఎస్ వైఫల్యంతో వచ్చిందని పట్టభద్రులంతా తీన్మార్ మల్లన్నను గెలిపించి ప్రశ్నించే గొంతుకను చట్ట సభకు పంపాలని కోరారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ప్రజలకు చేసింది ఏమీలేదని మంత్రి పొంగులేటి విమర్శించారు.

- శీనన్నా.. చట్ట సభకు తీసుకెళ్లన్నా..

అన్నా పొంగులేటి శీనన్నా ఎమ్మెల్సీ ఎన్నికల్లో నన్ను గెలిపించి చట్ట సభకు తీసుకెళ్లన్నా అని ఖమ్మం, నల్గొండ, వరంగల్ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న మంత్రి పొంగులేటిని వేదికపై ఆప్యాయంగా కోరారు. గత ప్రభుత్వంలో కేసీఆర్, కేటీఆర్ తన పట్ల కక్షపూరితంగా వ్యవహరించారని, రోజుల తరబడి జైల్లో పెట్టి భార్యా బిడ్డలకు మనశ్శాంతి లేకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పట్టభద్రులను రోడ్డున పడేసిందని, వారి స్వార్థానికే ఈ ఉప ఎన్నిక వచ్చిందని తెలిపారు. బీఆర్ఎస్ వారు అమెరికా నుంచి అభ్యర్థిని బరిలో దించారని, తాను చదివింది ప్రభుత్వ బడిలోనే అయినా వంద మంది విద్యార్థులను చదివిస్తున్నానని మల్లన్న అన్నారు. ఎప్పుడూ ప్రజల పక్షాన నిలిచానని, కేసులకుఏ బెదిరేది లేదని, పట్టబద్రులు, ప్రజల సమస్యలను చట్ట సభలలో వినిపిస్తానని, ఒక్క అవకాశం ఇచ్చి గెలిపించాలని కోరారు.

కార్యక్రమంలో కాంగ్రెస్ లోక్‌సభ అభ్యర్థి రఘురాంరెడ్డి, ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జ్ రఘునాథయాదవ్, జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర విద్యా, మౌలిక వసతుల కార్పొరేషన్ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, సీనియర్ నాయకురాలు మద్దినేని స్వర్ణకుమారి, సీపీఐ నాయకులు దండి సురేష్, జెడ్పీటీసీ బెల్లం శ్రీను, ఎంపీపీ బోడ మంగీలాల్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కళ్యాం వెంకటరెడ్డి, మెండెం కిరణ్, చావా రామక్రిష్ణ, నెల్లూరి భద్రయ్య, మద్ది మల్లారెడ్డి, గోవిందరావు,అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కుటుంబంతో కలిసి సౌతాఫ్రికాకు మంత్రి పొంగులేటి

ఖమ్మం, మే 21(ఆంధ్రజ్యోతిప్రతినిధి): రెవెన్యూ, గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తన కుటుంబసభ్యులతో కలిసి మంగళవారం రాత్రి విదేశీ పర్యటనకు బయలుదేరి వెళ్లారు. ఈ నెల 31వరకు సౌత్రాఫికా రాజధాని కేప్‌టౌన్‌తో పాటు పలు ప్రదేశాలను సందర్శించి తిరిగి హైదరాబాదుకు రానున్నారు.

బ్రిడ్జి పనులు నిర్వహిస్తున్న కూలీ మృతి

ఖమ్మంక్రైం, మే21: నగరంలోని ధంసలాపురం బ్రిడ్జి కూలీ పనులు నిర్వహిస్తున్న చేస్తున్న ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం ఖమ్మం నగరంలో జరిగింది. అర్బన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వెస్ట్‌బెంగాల్ రాష్ట్రం శాంతిపూర్‌నకు చెందిన గంగారాజువర్ (45) అనే వ్యక్తి నగర శివారులోని ధంసలాపురం బ్రిడ్జి వద్ద పనులు నిర్వహిస్తున్నాడు. సోమవారం మధ్యాహ్నం సమయంలో బ్రిడ్జిపై ఇనుపరాడ్లను వేస్తుండగా ప్రమాదవశాత్తూ కిందపడి మృతి చెందాడు. దీంతో మృతదేహాన్ని స్థానికులు ప్రభుత్వాసుపత్రి మార్చురికి తరలించారు. అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. ఈఘటనపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అర్బన్ పోలీసులు తెలిపారు.

చింతకానిలో ఒడిశా యువకుడు..

చింతకాని, మే 21: మతిస్థిమితం లేని ఒడిశా రాష్ట్రానికి చెందిన వ్యక్తి మృతి చెందిన సంఘటన చింతకాని రైల్వే స్టేషన్ సమీపంలో రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద చోటు చేసుకుంది. జీఆర్‌పీ ఎస్ఐ భాస్కర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రానికి చెందిన రోహిత్ మింజ్ (21) ఈ నెల 18వ తేదీన గుర్తు తెలియని రైలు నుంచి చింతకాని రైల్వే స్టేషన్ సమీపంలో జారి పడ్డాడు. స్వల్ప గాయాలతో ఉన్న అతడూ చుట్టు పక్కల ప్రాంతంలో తిరుగుతూ ఎండ తీవ్రతకు తట్టుకోలేక మంగళవారం మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి వద్ద లభించిన ఆధారాల ద్వారా ఒడిశా రాష్ట్రానికి చెందిన యువకుడిగా గుర్తించి, మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారాన్ని అందజేసినట్లు తెలిపారు. మృతదేహాన్ని అన్నం సేవా ఫౌండేషన్ సభ్యుల సహకారంతో ఖమ్మం ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించినట్లు పేర్కొన్నారు. కాగా మృతుడికి మతి స్థిమితం సరిగ్గా లేదని ఎస్ఐ పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి ...

పాల్వంచ, మే 21 : ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటనపై పాల్వంచ టౌన్ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. పాల్వంచ పట్టణ పరిధిలోని గట్టాయిగూడేనికి చెందిన మాలోతు శ్రీను(38) స్థానికంగా కూలీపని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కొంత కాలంగా తల్లి అనారోగ్యంతో ఉండటంతో ఆమె గురించి మనోవేదన చెందుతూ మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలోనే ఈ నెల 16న పురుగుందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వాంతులు చేసుకుంటుండగా గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రికి, అనంతరం మెరుగైన వైద్యం కోసం కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడి తల్లి సక్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ ఎస్ఐ బానాల రాము తెలిపారు.

వృద్ధాప్యంతో కాంట్రాక్టర్ ..



వెంకటేశ్వరరావు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ నామా నాగేశ్వరరావు

పాల్వంచటౌన్, మే 21: పాల్వంచ కాంట్రాక్టర్ చనుమోలు(పంచకట్టు) వెంకటేశ్వరరావు(84) మంగళవారం కాంట్రాక్టర్స్ కాలనీలోని తన నివాసంలో వృద్ధాప్యంతో మృతి చెందారు. పాల్వంచ పట్టణానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కిలారు నాగేశ్వరరావుకు చనుమోలు సమీప బంధువు. ఖమ్మం పార్లమెంట్ సభ్యుడు నామా నాగేశ్వరరావు, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, పలు పార్టీలకు చెందిన కోనేరు చిన్ని, కొత్వాల శ్రీనివాసరావు, ముత్యాల విశ్వనాథం, వీసంశెట్టి పూర్ణ, అడుసుమిల్లి సాయిబాబు, దొడ్డా రవి, మంతపురి రాజుగౌడ్, నలమల వేణుతో పాటు పలువురు ప్రముఖులు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం మృతుడు కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

ఖమ్మంక్రైం, మే21: ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఖమ్మం నగరంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ముస్తఫానగర్‌కు చెందిన దొండా శ్రీనివాస్(44) అనే వ్యక్తి నగరంలోని ఖానాపురంలో ఉన్న ఓ గ్రానైట్ ఫ్యాక్టరీలో పనులు చేస్తున్నాడు. కుటుంబ సమస్యలతో మంగళవారం తెల్లవారుజామున విధులు నిర్వహిస్తున్న ఫ్యాక్టరీలోనే ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అది గమనించిన ఫ్యాక్టరీ సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురికి తరలించారు. మృతుడి కుమారుడు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

5క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



పోలీసులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం తరలిస్తున్న ఆటో

సత్తుపల్లిరూరల్, మే21: అక్రమంగా తరలిస్తున్న ఐదు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సత్తుపల్లి పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. పట్టణ సీఐ టీ.కిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని సదాశివునిపేటకు చెందిన కర్నాటి భద్రం సుమారుగా 5క్వింటాళ్ల రేషన్‌బియ్యాన్ని అమ్ముతున్నాడని సమాచారం మేరకు పోలీసులు ఆటోలో సోదాలు చేసి ఐదు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. ఆటోను, రేషన్ బియ్యంతో పాటు పోలీస్ స్టేషన్‌కు తరలించి అతడి పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. కాగా గ్రామంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి కేజీ రూ.10చొప్పున కొనుగోలు చేసిన రేషన్ బియ్యాన్ని ఆంధ్రాలోని చిన్నంపేటలోని ఓ వ్యాపారికి చెందిన నూకల మిల్లుకు రోజుకు ఐదారు ట్రిప్పుల చొప్పున తోలుతుంటాడని, ఇతనిపై గతంలో 4కేసులు నమోదైనట్లు సమాచారం. ఇంత జరుగుతున్నా అధికారులు పట్టించు కోవడం లేదని వాపోతున్నారు. పేదల బియ్యాన్ని పక్కదారి పట్టించే వారిపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని నిరుపేదలు ప్రశ్నిస్తున్నారు.

నకిలీ విత్తనాల విక్రయాలపై ఉక్కుపాదం

- భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజ్

కొత్తగూడెం, మే 21(ఆంధ్రజ్యోతి): నకిలీ విత్తనాలు విక్రయిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్‌రాజ్ మంగళవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. అమాయక రైతులను మోసం చేస్తూ, అక్రమార్జనే ధ్యేయంగా కొంతమంది అక్రమార్కులు నకిలీ విత్తనాలను విక్రయిస్తున్నారని, నకిలీ విత్తనాలను అరికట్టేందుకు జిల్లావ్యాప్తంగా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. కొన్ని కంపెనీలు కాలం చెల్లిన విత్తనాలను, రీసైక్లింగ్ చేసి కొత్త విత్తనాలు అని చెప్పి రైతులకు అమ్మడం ద్వారా సరైన దిగుబడి రాక రైతులు పెద్ద సంఖ్యలో నష్టపోతున్నారన్నారు. రైతులు నకిలీ విత్తనాల మురాల భారీనపడకుండా జిల్లా వ్యాప్తంగా వ్యవసాయశాఖ అధికారులతో కలిసి సమన్వయం పాటిస్తూ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలోని విత్తన దుకాణాల్లో తనిఖీలు చేపట్టేవిధంగా పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. రైతులకు మేలురకం విత్తనాలను విక్రయించే విధంగా చేసి నకిలీ, కల్తీ విత్తనాలను సరఫరా చేసే వారిపై ఉక్కుపాదం మోపాలని రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర డీజీపీ ఆదేశాల మేరకు నకిలీ విత్తనాలను అరికట్టేందుకు జిల్లా వ్యాప్తంగా అధికారులు అప్రమత్తతో సమాచారాన్ని సేకరించి కఠినంగా వ్యవహరించటం జరుగుతుందన్నారు. వానాకాలం సాగుచేసేందుకు రైతులు సన్నద్ధమవుతున్న సమయంలో నకిలీ విత్తనాలను విక్రయించేందుకు కొందరు వ్యక్తులు ప్రయత్నాలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. వారిని అరికట్టడంలో భాగం గా జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలోని విత్తన దుకాణాల యజమానులకు పలు సూచనలు చేయటం జరుగుతుందన్నారు. నకిలీ విత్తనాలను సరఫరా చేసేవారిని గుర్తించి వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. లైసెన్స్‌లు లేకుండా దుకాణాలు నడిపినా, రికార్డులను సరైన పద్ధతిలో మెయింటెన్ చేయలేకపోయినా, నకిలీ విత్తనాలను విక్రయించిన యజమానులపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందేలా ప్రభుత్వ అనుమతి పొందిన సంస్థల నుంచి విత్తనాలను వినియోగించేలా ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో రైతులకు అవగాహన కార్యక్రమాలను ఏర్పాటుచేయటం జరుగుతుందన్నారు. నకిలీ విత్తనాలు ఇతర ప్రాంతాల నుంచి జిల్లాకు రవాణా కాకుండా సరిహద్దు ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి నిఘా మరింత పటిష్టం చేసినట్లు తెలిపారు. అక్రమ రవాణాను జరిగే ప్రాంతాలు, మార్గాలను గుర్తించి ఆకస్మిక తనిఖీలు చేయడం, మొబైల్ చెక్‌పోస్టులు ఏర్పాటుచేయటంతోపాటు నకిలీ, కల్తీ విత్తనాల రవాణా, సరఫరాను అరికట్టడం జరుగుతుందన్నారు.

ఎస్పీ రోహిత్‌రాజ్‌కు సన్మానం



ఎస్పీ రోహిత్‌రాజ్‌ను సన్మానిస్తున్న సింగరేణి సంక్షేమ సంఘం ఉద్యోగులు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, మే21: ఇటీవల రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు కృషి చేసిన భద్రాద్రి జిల్లా ఎస్పీ బిరుదురాజు రోహిత్‌రాజ్‌ను సింగరేణి ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ సంక్షేమ సంఘం సభ్యులు మంగళవారం సన్మానించారు. మంగళవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో సంక్షేమ సంఘం జనరల్ సెక్రటరీ ఆంథోటి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఎస్పీని సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లాలో అసెంబ్లీతో పాటు, పార్లమెంట్ ఎన్నికలు సజావుగా జరిగేందుకు అన్ని వర్గాల ప్రజలు, అధికారులు సిబ్బంది సహకరించడంతోనే సాధించామని ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు సుమన్‌యాదవ్, సకినాల సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

గాలి, వాన బీభత్సం

- కూలిన చెట్లు, విరిగిన కరెంట్ స్తంభాలు
- నిలిచిపోయిన విద్యుత్ సరఫరా

కరకగూడెం, మే21: మండల వ్యాప్తంగా మంగళవారం సాయంత్రం ఉరుములతో కూడిన భారీ వర్షం కురిసి నానా బీభత్సాన్ని సృష్టించింది. చిర్రమళ్ల--పోల కమ్మతోగు గ్రామాల మధ్య రహదారిపై చెట్లు విరిగి పడ్డాయి. ఆరు విద్యుత్ స్థంభాలు విరిగి పోయాయి. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. కరకగూడెం లోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో అనంతారం, పద్మాపురం, మోతే గ్రామాల్లో రైతులు ఆరబోసిన ధాన్యం తడవకుండా పడరాని పాట్లు పడాల్సి వచ్చింది. పట్టాలు కప్పి ధాన్యం కాపాడుకునే పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు.



చిర్రమళ్ల గ్రామ శివారులో రహదారిపై విరిగిపడిన చెట్టు

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి దుర్మరణం

- ఇద్దరికి తీవ్రగాయాలు
- ప్రమాద బాధితులను అంబులెన్స్‌లో పంపించిన ఎమ్మెల్యే జారే

దమ్మపేట, మే 21: వేర్వేరుగా జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి చెందగా, ఇద్దరికి తీవ్ర గాయాలైన మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గండుగులపల్లి గ్రామానికి చెందిన కుంజా నాగేందర్ (18), గొర్రెగుట్ట గ్రామానికి చెందిన సోయం నాగేంద్రబాబు (23), గోరం సాగర్ అనే ముగ్గురు యువకులు ద్విచక్రవాహనంపై దమ్మపేట వెళుతుండగా పట్వారీగూడెం క్రాస్‌రోడ్ వద్ద పాల్వంచ వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టింది.





ప్రమాదంలో మృతి చెందిన కుంజా నాగేంద్రబాబు, సోయం నాగేంద్రబాబు



క్షతగాత్రులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే జారె ఆదినారాయణ

ఈఘటనలో ముగ్గురు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు ఎమ్మెల్యే జారె ఆదినారాయణకు సమాచారం ఇవ్వడంతో వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని త్రీవంగా గాయపడ్డ యువకులను అంబులెన్స్‌లో ఖమ్మం తరలించే ఏర్పాటు చేశారు. కాగా కుంజా నాగేంద్ర, సోయం నాగేంద్రబాబు మార్గ మధ్యలో మృతి చెందారు. మరొక వ్యక్తి గోరం సాగర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

అదేవిధంగా దమ్మపేట మండలం కటుకూరు గ్రామానికి చెందిన పూనం చరణ్ (18), పసక రమేష్‌లు కలిసి ద్విచక్రవాహనంపై దమ్మపేట వస్తుండగా చిల్లగుంప గ్రామ సమీపంలో పాల్వంచవైపు వెళ్తున్న లారీ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈఘటనలో చరణ్ అక్కడిక్కడే మృతి చెందాడు. 108 సహాయంతో గాయనపడిన రమేష్‌ను దమ్మపేట వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం కొత్తగూడెం ఆస్పత్రికి తరిలించినట్లు సమాచారం.

వేటగాళ్ల ఉచ్చులో ఇరుక్కుపోయిన గేదె

- రక్షించిన స్థానికులు

అశ్వారావుపేట, మే 21: నీటి కోసం వచ్చిన గేదె వేటగాళ్లు బిగించిన ఉచ్చులో చిక్కుకున్న సంఘటన మండల పరిధిలోని తిరుమలకుంట సమీపంలోని పోటు చెరువు వద్ద మంగళవారం చోటు చేసుకుంది. తిరుమలకుంటకు చెందిన అరిగెల మోహనరావుకు చెందిన గేదె నీటి కోసం పోటు చెరువు వద్ద వెళ్లగా, అక్కడ జంతువుల వేట కోసం వేటగాళ్లు బిగించిన ఇనుప ఉచ్చులో చిక్కుకుంది. గమనించిన ఓ వ్యక్తి వైరును మధ్యలో నరికి గేదెను గ్రామంలోకి తోలుకొని వచ్చాడు. అప్పటికే గేదె మెడకు వైర్ బలంగా బిగిసుకొని పోయి నాలుక బైటకు వచ్చేసింది. గ్రామస్థులు అతికష్టం మీద గేదె మెడకు బిగుసుకొని పోయిన ఇనుపవైరును తొలగించారు. గేదె సురక్షితంగా బయట పడగా, నాలుక కట్ అయ్యింది.

రెండు ద్విచక్ర వాహనాలను ఢీ కొన్న కారు

- ముగ్గురికి గాయాలు

జూలూరుపాడు, మే 21: మండల కేంద్రమైన జూలూరుపాడులోని ప్రధాన కూడలిలో మంగళవారం కారు రెండు ద్వి చక్ర వాహనాలను ఢీ కొనడంతో పంచాయతీ కార్యదర్శితో పాటు మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. కొత్తగూడెం నుంచి ఖమ్మం వైపు అతి వేగంతో వెళ్తున్న కారు జూలూరుపాడులో బైకులను ఢీ కొట్టింది. ఈ సంఘటనలో వెంగన్నపాలెం గన్నపాలెం పంచాయతీ కార్యదర్శి గోరపూడి లక్ష్మీనారాయణ, పంచాయతీ గుమస్తా శిరంశెట్టి వినోద్, జూలూరుపాడుకు చెందిన యువకుడు యల్లంకి సందీప్ గాయపడ్డారు. క్షతగాత్రులను ఖమ్మం, కొత్తగూడెంలల్లోని ప్రైవేట్ ఆస్పత్రులకు తరలించారు.

11నెలల బాలుడి అదృశ్యం

- సత్తుపల్లి పట్టణం గుడిపాడు శివారులో ఘటన
- వైట్ కలర్ బొలెరో కారులో వచ్చినట్లుగా తల్లిదండ్రుల అనుమానం

సత్తుపల్లిరూరల్, మే21: అప్పటి వరకు కేరింతలు కొడుతూ తల్లిదండ్రుల వద్ద నిద్రించిన 11 నెలల బాలుడు అదృశ్యమైన సంఘటన సత్తుపల్లి మునిసిపాలిటీలోని గుడిపాడు శివారు ప్రాంతంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలోని జయమ్మ కాలనీకి చెందిన వానరాశి జంపన్న, దుర్గ దంపతులు 11నెలల కుమారుడు సాయి దేవాన్ష్‌తో కలిసి వారం రోజుల క్రితం సత్తుపల్లికి బతుకుదెరువు కోసం వచ్చారు. పట్టణంలోని గుడిపాడు శివారులోని పరిసర ప్రాంతాల్లో ఆయా పనులు చేసుకుంటున్న వారు, తమ బంధువులతో కలిసి గుడిసెలలో నివాసం ఉంటూ బీరువాలు బాగుచేసే పనికి వెళ్తున్నారు. ఈ క్రమంలో సోమవారం రాత్రి 11 గంటల తర్వాత ఒంటి గంట మధ్యలో ఏదో అలికిడి రావడంతో బాలుడు తల్లిదండ్రులు లేచి చూసేసరికి ఆ బాలుడు కనిపించలేదు. చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికినా కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పట్టణ సీఐ టీ.కిరణ్ బాలుడు తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



సాయిదేవాన్ష్

అయితే కొద్దిరోజులుగా తమ ప్రాంతంలో వైట్ కలర్ బొలెరో కారులో ఓ వ్యక్తి వచ్చిపోతూ అనుమానాస్పదంగా కనిపిస్తున్నాడని బాధితులు చెబుతున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా బాలుడు అదృశ్యం కావడంతో సత్తుపల్లి ప్రాంతం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. పోలీసులు ప్రత్యేక చొరవ తీసుకుని గస్తీ పెంచాలని కోరుతున్నారు. అదేవిధంగా అనుమానాస్పదంగా తిరిగే వారి సమాచారం వెంటనే తమకు చేరవేయాలని పోలీసులు తెలిపారు.

కాగా బతుకుదెరువు కోసం సత్తుపల్లి వచ్చిన ఆ తల్లిదండ్రులకు బాలుడి అదృశ్యంతో శోకమే మిగిలింది. అప్పటివరకు తమతో ఆడిపాడిన చిన్నారి కనిపించకపోవడంతో వారి రోధన మిన్నంటింది.

ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలి

- ఉమ్మడి ఖమ్మం జిల్లా రీజనల్ మేనేజర్ వెంకన్న

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కరకగూడెం, మే 21: టికెట్ మిషిన్ పనిచేయడం లేదని పురుషలను బస్సు కండక్టర్ ఎక్కించుకోకపోవడంతో ప్రయాణికుల ఇబ్బందులు పడాల్సిన దుస్థితి నెలకొంది. దాంతో టికెట్ మిషన్ పనిచేయడం లేదని పురుషలకు నో ఎంట్రీ.. అనే కథనానికి స్పందించిన ఉమ్మడి ఖమ్మం జిల్లా రీజనల్ మేనేజర్ సీహెచ్ వెంకన్న ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఉమ్మడి ఖమ్మం జిల్లా డిపోలా మేనేజర్లకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మణుగూరు డిపో నుంచి కరకగూడెం మీదుగా నడుపుతున్న పల్లెవెలుగు సర్వీస్‌కు సంబంధించిన సర్వీసు నిర్వహణ సమయంలో స్వల్ప సాంకేతిక సమస్య వలన టిమ్ నుంచి టికెట్లు జారీ చేయడం వీలు పడలేదన్నారు. ఈ విషయాన్ని సర్వీస్ కండక్టర్ సదరు డిపో మేనేజర్ దృష్టికి తీసుకొని వెళ్లగా, విద్యార్థినులకు, మహిళలకు ఉచిత రవాణా సౌకర్యం ఉన్న కారణంగా వారి సౌకర్యార్థం టిక్కెట్లు జారీ చేయడం వీలు కానప్పటికీ మహిళా ప్రయాణికులను, విద్యార్థినులను మాత్రం బస్సులో ప్రయాణాలనాకు అనుమతించాల్సిందిగా చేసిన సూచన మేరకు సర్వీసు కండక్టర్ వారిని ప్రయాణానికి అనుమతించడం జరిగిందన్నారు. టిమ్ మిషన్‌లో సాంకేతిక సమస్య వచ్చిన నేపథ్యంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలోని అన్ని డిపోలలో ఉన్న టిమ్‌ల పనితీరుపై సమీక్షించడం జరిగిందన్నారు. ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాని ఉమ్మడి ఖమ్మం జిల్లా డిపో మేనేజర్లకు ఆదేశాలు జారీ చేశారు. మారుమూల ఏజెన్సీ ప్రాంతాలలో నడిచే సర్వీసులలో మరో మారు ఇలాంటి పరిస్థితి పునరవృతం కాకుండా చూడాలని మణుగూరు డిపో మేనేజర్ స్వామికి తెలిపారు.

జాతీయ స్థాయిలో అనుబోస్ కళాశాలకు గుర్తింపు



అనుబోస్ ఇంజనీరింగ్ కళాశాల

పాల్వంచ, మే 21 : పాల్వంచ పట్టణంలోని ఇంజనీరింగ్ కళాశాల అనుబోస్ ఇంజనీరింగ్ కళాశాలకు జాతీయ స్థాయిలో ఎన్ఏఏసీ-బీ ప్లస్‌ప్లస్ గ్రేడ్‌తో జాతీయస్థాయి గుర్తింపు లభించింది. కళాశాలకు జాతీయస్థాయిలో గుర్తింపు వచ్చిన సందర్భంగా కళాశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో కళాశాల చైర్మన్ తలశిల భరత్‌కృష్ణ, కరస్పాండెంట్ డాక్టర్ అవనిలు పాల్గొని హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిబ్బంది సమన్వయంతో సమష్టి కృషితో కళాశాలకు ఈ గుర్తింపు వచ్చిందన్నారు. ఈకార్యక్రమంలో నేషనల్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ చైర్మన్ అనురాధ, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవి, వైస్ ప్రిన్సిపాల్ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

తండ్రికి తలకొరివి పెట్టిన ఐదేళ్ల కుమార్తె

చింతకాని, మే 21: చింతకాని మండలం నాగులవంచ రైల్వే కాలనీ గ్రామానికి చెందిన కోపూరి నాగార్జున (29) గుండెపోటుతో సోమవారం మృతి చెందిన విషయం తెలిసిందే. మృతుడికి ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కాగా పెద్ద కుమార్తెన అయిదేళ్ల కోపూరి నయన తండ్రికి మంగళవారం తలకొరివి పెట్టింది. అయిదేళ్ల చిన్నారి తన తండ్రికి తలకొరివి పెట్టే సంఘటన అక్కడ ఉన్న ప్రతి ఒక్కరినీ కన్నీటిపర్యంతం చేసింది.

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
భద్రాద్రి కొత్తగూడెం
కొత్తగూడెం, ఇల్లెందు, భద్రాచలం, పినపాక, అశ్వారావుపేట
8
బుధవారం 22 మే 2024



ఓటు హక్కును వినియోగించుకోండి



చండ్రుగొండ, మే 21: ఈ నెల 27న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని తహశీల్దార్ సంధ్యారాణి కోరారు. చండ్రుగొండ తహశీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ మండలంలో 783 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. 27న ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. ఈ సమయంలో ఓటర్లు తమ ఓటు వేయాలని సూచించారు. ఇప్పటికే ఓటర్లుకు స్లిప్పులు పంపిణీ జరిగిందని తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని తహశీల్దార్ కోరారు.

రాజీవ్ గాంధీ ప్రగతికి మార్గదర్శి

వర్ధంతి సభలో పినపాక ఎమ్మెల్యే పాయం

పలు చోట్ల వర్ధంతి సభలు.. పాల్గొన్న ఎమ్మెల్యేలు



నివాళులర్పిస్తున్న పాయం



కార్యక్రమంలో పాల్గొన్న జారే



నివాళులర్పిస్తున్న 'తెల్లం'

మణుగూరు, మే 21: రాజీవ్ గాంధీ భారత దేశ ప్రగతికి మార్గదర్శిగా నిలిచారని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం మణుగూరులోని ఓ ఫంక్షన్ హాల్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రాజీవ్ 33 వ వర్ధంతి సభకు హాజరైయ్యారు. రాజీవ్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకులు పి నవీన్, శివ, కాటిబోయిన నాగేశ్వరరావు, దొబ్బల వెంకటప్పయ్య, పుచ్చకాయల శంకర్, కెవీ రావు, కోటేశ్వరరావు, సుదాకర్ రెడ్డి, సుబ్బారెడ్డి, వరలక్ష్మి, కురం రవి, తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీ సేవలు మరువలేనివి: జారే

దమ్మపేట: ప్రధానిగా రాజీవ్‌గాంధీ సేవలు మరువలేనివని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారయణ అన్నారు. దమ్మపేటలో రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతు భారతదేశానికి టెక్నాలజీని అందుబాటులోకి తెచ్చిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. అనంతరం అశ్వారావుపేట నియోజకవర్గ ఎంఎల్సీ ఎన్నికల ఇన్‌చార్జీ పిడమర్తి రవితో కలిసి సమావేశంలో పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటి చేస్తున్న తీన్మార్ మల్లను గెలిపించేందుకు కాంగ్రెస్ కార్యకర్తలను కోరారు.

రాజీవ్ ఆశయసాధనకు కృషి చేయాలి: కనకయ్య

ఇల్లెందుటౌన్: దేశాన్ని అధునిక టెక్నాలజీ రంగంగలోకి తీసుకొచ్చిన ఘనత భారత్న, మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీకే దక్కుతుందని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య ప్రశంశించారు. మంగళవారం స్థానికి క్యాంపుకార్యలయంలో రాజీవ్ గాంధీ వర్ధతి సందర్భంగా రాజీవ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో సాంకేతిక రంగాన్ని పరుగులు పెటించాడని కొనియాడారు. పల్లెప్రాంతాల్లో సైతం సాంకేతిక రంగాన్ని విస్తరింపచేశాడన్నారు.

రాజీవ్ సేవలు చిరస్మరణీయం: తెల్లం

భద్రాచలం: దేశానికి రాజీవ్‌గాంధీ చేసిన సేవలు చిరస్మరణీయమని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు అన్నారు. భద్రాచలంలో మంగళవారం రాజీవ్‌గాంధీ వర్ధంతి వేడుకలను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశాన్ని ఐటీ, టెలికం, అంతరిక్ష పరిశోధన రంగాల్లో అగ్రగామిగా నిలిపి సాంకేతిక విప్లవాన్ని తీసుకొచ్చిన రాజీవ్‌గాంధీ సేవలు ప్రజలెన్నటికి మరువరని పేర్కొన్నారు. రాజీవ్ ఆశయ సాధనకు యువత నడుంబిగించాలని కోరారు. ఇదిలా ఉండగా డీసీసీ అధ్యక్షులు పొదెం వీరయ్య క్యాంపు కార్యాలయంలో కూడా రాజీవ్‌గాంధీ వర్ధంతి నిర్వహించారు.

ప్రజల పక్షాన పోరాడితేనే
నాపై కేసులు

కవిత ఏం చేసి జైలుకెళ్లిందో కేటీఆర్ చెప్పాలి

పల్లా చేతకానితనంతోనే ఉపఎన్నిక వచ్చింది

బీఆర్ఎస్, బీజేపీలకు ఓటడిగే అర్హత లేదు

కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న

కొత్తగూడెం క్లబ్‌లో పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనం



అభివాదం చేస్తున్న తీన్మార్ మల్లన్న, కూనంనేని తదితరులు

కొత్తగూడెం, మే 21(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులు, పేదల పక్షాన పోరాడినందుకే గత బీఆర్ఎస్ ప్రభుత్వం తనపై వంద కేసులు పెట్టిందని, మరి కల్వకుంట్ల కవిత ఏం చేసి జైలుకెళ్లిందో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చెప్పాలని పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న ప్రశ్నించారు. గతంలో బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసిన పల్లా రాజేశ్వర్‌రెడ్డిని గెలిపిస్తే చేతకాక రాజీనామా చేస్తేనే ఈ ఉపఎన్నిక వచ్చిందన్నారు. కొత్తగూడెం క్లబ్‌లో మంగళవారం కాంగ్రెస్, సీపీఐ పార్టీల ఆధ్వర్యంలో జరిగిన పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ గతంలో పట్టభద్రుల ఓట్లతో గెలిచిన పల్లా రాజేశ్వర్‌రెడ్డి విద్యార్థులు, నిరుద్యోగులను ఒక్కరినైనా కలిసిన దాఖలాలు లేవన్నారు. ఇప్పుడు మళ్లీ ఆ పార్టీ అభ్యర్థికి ఎందుకు ఓటు వేయాలని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పార్టీకి అభ్యర్థి లేక అమెరికా నుంచి ఒక బకరాను తీసుకువచ్చి పెట్టారన్నారు.ఇక బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి గురించి తాను తన చానల్‌లో చర్చ పెడితేనే ఆయనకు సీటు వచ్చిందన్నారు. తీన్మార్ మల్లన్నపై వంద కేసులు పెట్టిన కేసీఆర్ ఒక్క కేసైనా నిరూపిస్తే కొత్తగూడెంలోని అమరవీరుల స్థూపం వద్ద ఉరేసుకునేందుకు తాను సిద్ధంగా ఉన్నానని, మరి వారు సిద్ధమేనా అని సవాల్ చేశారు. తాను ఉద్యోగులు, నిరుద్యోగులతో పాటు పేదల సమస్యలపై కొట్లాడితేనే తనపై వంద కేసులు పెట్టారన్నారు. మరీ కల్వకుంట్ల కవిత ఏంచేసి జైలుకు వెళ్లిందనే విషయం కేటీఆర్ చెప్పాలన్నారు. నిత్యావసరాల ధరలు పెంచి సామాన్యులపై పెనుభారం మోపిన బీజేపీకి అసలు ఓటు ఎందుకు వేయాలన్నారు. తనకు బీ-ఫామ్ కాంగ్రెస్ పార్టీ ఇచ్చినా గెలిపించేదిమాత్రం ఓటర్లేనన్నారు. వారే దేవుళ్లన్నారు. తనను గెలిపిస్తే తన అమ్మానాన్న సాక్షిగా పట్టభద్రుల ఓటు వృధాకానివ్వనని హామీ ఇచ్చారు. కొత్తగూడెం గడ్డకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నానని, తెలంగాణ ఉద్యమం ఇక్కడే ప్రారంభమై రాష్ట్ర ఏర్పాటుకు కూడా ఇక్కడే నాంది పలికిందన్నారు. ఈ ప్రాంతంలో చైతన్యవంతమైన ప్రజలు ఉన్నారని, గత ఎన్నికల్లో కూడా తనకు ఇక్కడి ఓటర్లు వెన్నుదన్నుగా నిలబడి సహకరించారని గుర్తు చేశారు. ఆ ఎన్నికల్లో పల్లా రాజేశ్వర్‌రెడ్డి దొంగ ఓట్లతో గెలిచాడని ఆరోపించారు. ఓటర్లు తనకు పూర్తి సహాయసహకారాలు అందించి ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. బ్యాలెట్‌లో సీరియల్-2లో తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలన్నారు.

కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ ప్రజాగొంతుక వినిపించే తీన్మార్ మల్లన్నను చట్టసభలకు పంపుదామన్నారు. బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు ఓటు అడిగే హక్కును కోల్పోయారన్నారు. పట్టభద్రులు విజ్ఞతతో ఆలోచించి మల్లన్నకు ఓటు వేసి గెలిపించాలన్నారు. జర్నలిస్టు వృత్తిని ఆయుధంగా చేసుకొని ప్రజా వ్యతిరేక పాలకులను నిలదీస్తున్న తీన్మార్ మల్లన్న ప్రజాగొంతుక అన్నారు. ఈ గొంతుకను చట్టసభలకు పంపితే పట్టభద్రులతోపాటు ప్రజలకు మరింత మేలు జరుగుతుందన్నారు. ఈ ఆత్మీయ సమ్మేళనంలో ఖమ్మం లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురామిరెడ్డి, కొత్తగూడెం ఎన్నికల సమన్వయకర్త తుళ్లూరి బ్రహ్మయ్య, కాంగ్రెస్ నాయకులు ఎడవల్లి కృష్ణ, సీపీఐ నాయకుడు షేక్.షాబీర్‌పాషా, సీపీఎం నాయకుడు అన్నవరపు కనకయ్య, తోట దేవిప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న సీఐ అశోక్

అశ్వాపురం, మే 21: ఎరువులు, పురుగు మందుల వ్యాపారులు నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అశ్వాపురం సీఐ అశోక్‌రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వ్యాపారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాలు సరఫరా చేయాలన్నారు. బిల్లులు, రికార్డుల నిర్వహణ తప్పని సరిగా పాటించాలన్నారు. నకిలీ విత్తనాలు విక్రయించినా, రైతులకు రశీదులు ఇవ్వకపోయినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

మల్లన్నది ప్రశంసించే గొంతుక

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు



మాట్లాడుతున్న రేగా కాంతారావు

భద్రాచలం, మే 21: తీన్మార్ మల్లన్న ప్రశ్నించే గొంతు అయితే ఇప్పుడు ఆ గొంతు ఎందుకు ప్రశ్నించడం లేదని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. భద్రాచలంలో మంగళవారం బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేష్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపిస్తే ప్రభుత్వంకి అనుకూలంగా ఉంటాడా లేక నిరుద్యోగులకు అండగా ఉంటాడా పట్టభద్రులు ఆలోచించాలని కోరారు. తీన్మార్ మల్లన్న ప్రశ్నించే గొంతు కాదని ప్రభుత్వాన్ని ప్రశంసించే గొంతుగా మారుతోందని, ప్రశ్నించే గొంతులు మండలిలో ఉండాలని అందుకు దీటైన అభ్యర్థి రాకేష్‌రెడ్డి మాత్రమేనని అన్నారు. రాకేష్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. రాకేష్ రెడ్డి నిరుద్యోగులకు అండగా ఉంటాడని అన్నారు. ఆయన గెలుపునకు అందరూ ఐక్యంగా కృషిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు రావులపల్లి రాంప్రసాద్, మానె రామకృష్ణ, మణుగూరు జడ్పీటీసీ పోశం నరసింహారావు, గోపిరెడ్డి వెంకటరమణారెడ్డి, ఆకోజు సునీల్, దానియేలు ప్రదీప్, అయినాల రామకృష్ణ, ప్రభుకుమార్ పాల్గొన్నారు.

మల్లన్న గెలుపుకోసం కృషిచేయాలి



మాట్లాడుతున్న సురేష్

అశ్వాపురం, మే 21: ఖమ్మం, నల్గొండ, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్, సీపీఐ, మిత్రపక్షాల అభ్యర్థి తీన్మార్ మల్లన్న విజయం కోసం సీపీఐ శ్రేణులు కృషిచేయాలని సీపీఐ మండల కార్యదర్శి అనంతనేని సురేష్ అన్నారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మండల పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. జర్నలిస్ట్‌గా ప్రజాసమస్యలు తెలిసిన మల్లన్నను గెలిపించుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. కాంగ్రెస్, కమ్యూనిస్టులు కలిస్తే వరుస విజయాలు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కమటం వెంకటేశ్వరరావు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వేల్పుల మల్లికార్జున్, నాయకులు సురేందర్‌రెడ్డి, రాజేష్, వెంకటేశ్వర్లు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

జీలుగు విత్తనాల విక్రయాలు ప్రారంభం



విక్రయాలను ప్రారంభిస్తున్న దృశ్యం

మణుగూరు, మే 21: మణుగూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం కార్యాలయంలో మంగళవారం మండల వ్యవసాయ శాఖ అధికారి రామశివ రావు ప్రభుత్వం పంపిణీ చేసిన జీలుగు విత్తనాల విక్రయాలను ప్రారంభించారు. 30 కేజీల బ్యాగు రూ.1,116లుగా నిర్ణయించి విక్రయాలు జరుపుతున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సీఈఓ జ్ఞాన దాస్ సిబ్బంది తాజుద్దీన్, రాఘవులు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

వాహన దొంగల అరెస్టు

దుమ్ముగూడెం, మే 21: పాల్వంచ, కొత్తగూడెం, ఏపీ రాష్ట్రం అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాకల్లో ద్విచక్రవాహనాల చోరీలకు పాల్పడిన ముగ్గురితోపాటు దొంగిలించిన వాహనాలను, కొనుగోలు చేసిన మరో వ్యక్తిని ఎస్ఐ పోటు గణేష్ మంగళవారం పట్టుకున్నారు. నరసాపురం వద్ద మంగళవారం పోలీసుల వాహన తనిఖీల్లో భద్రాచలానికి చెందిన మల్లా రవీందర్, దుల్లా శ్రీనివాస్, బూర్గంపాడు మండలం గొమ్మూరుకు చెందిన బూరం అనీల్‌కుమార్‌లు పట్టుబడ్డారు. విచారించగా ప్రస్తుతం తాము నడుపుతున్న రెండు వాహనాలు దొంగతనం చేసిన వేనని, గతంలో దొంగిలించిన మరో మూడు వాహనాలను సుజ్ఞానపురానికి చెందిన భూక్యా సోమ్లాకు విక్రయించినట్లు తెలిపారు. కొత్తగూడెం త్రీటౌన్ పరిధిలో నాలుగు వాహనాలు, పాల్వంచ పీఎస్ పరిధిలో ఒక వాహనం, ఎటపాక పీఎస్ పరిధిలో ఒక వాహనాన్ని దొంగిలించారు. మొ త్తం ఏడు బైకులను అపహరించినట్లు అంగీకరించారు. ద్విచక్ర వాహనాలతో పాటు నలుగురు నిందితుల్ని పోలీసులు రిమాండ్‌కు తరలించారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

అశ్వాపురం మే 21: ఎరువులు, పురుగు మందుల వ్యాపారులు నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అశ్వాపురం సిఐ అశోక్‌రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వ్యాపారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాలు సరఫరా చేయాలన్నారు. బిల్లులు, రికార్డుల నిర్వహణ తప్పని సరిగా పాటించాలన్నారు. నకిలీ విత్తనాలు విక్రయించినా, రైతులకు రశీదులు ఇవ్వకపోయినా చర్యలు తప్పవని హెచ్చరించారు. నకిలీ విత్తనాలు విక్రయించడం చట్టరీత్యా నేరమన్నారు. ఇటువంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో ఎస్ఐ తిరుపతిరావు,పలువురు వ్యాపారులు పాల్గొన్నారు.

నవగ్రహాల మండపానికి భూమిపూజ

అశ్వాపురం, మే 21: మండల పరిధిలోని మొండికుంటలో నిర్మిస్తున్న శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ నిర్మాణ ప్రాంగణంలో ఏర్పాటు చేయనున్న నవగ్రహల మండపానికి మంగళవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భూమి పూజ నిర్వహించారు. అదేవిధంగా ఆలయ నిర్మాణం చుట్టూ ప్రహరీగోడ, తూర్పుద్వారం, ఉత్తర ద్వారం నిర్మాణాలను కూడా ప్రారంభించారు.

మైదానాన్ని సందర్శించిన సింగరేణి జీఎం

ఇల్లెందుటౌన్, మే 21: సింగరేణి ఇల్లెందు ఏరియా జేకే కాలనీ హైస్కూల్ క్రీడా మైదానాన్ని మంగళవారం సింగరేణి జీఎం జాన్‌ఆనంద్ సందర్శించారు. సింగరేణి ఆధ్వర్యంలో నూతనంగా నిర్మిస్తున్న వాకింగ్‌ట్రాక్ పనులు అదేవిధంగా గ్రౌండ్‌లో పార్కు ఏర్పాటు చేయడం కోసం స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాకింగ్‌ట్రాక్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీజీఎం పర్సనల్ జీవీ మోహన్‌రావు, డీజీఎం సివిల్ రవికుమార్, డీజీఎం ఫారెస్టరీ ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కేసులు

కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహ్మాన్



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ రెహ్మాన్

జూలూరుపాడు, మే 21: వ్యాపారులు రైతులకు నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ అన్నారు. మంగళవారం సాయంత్రం జూలూరుపాడులోని ఏవిఆర్ పంక్షన్ హల్‌లో మండలంలోని విత్తనాల, ఎరువుల వ్యాపారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాలను విక్రయించాలని సూచించారు. రైతలను మోసంచేస్తే కఠిన ,చర్యలు తప్పవని హెచ్చరించారు. నకిలీ విత్తనాలు, ఎరువులను నిలవ చేసిన ఉపేక్షించేది లేదన్నారు. రైతులకు బిల్లులను అందించాలని, రికార్డులు, రిజిస్టర్‌లలో స్టాక్ వివరాలను నమోదు చేయాలని తెలిపారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గ్రామాలలో తనిఖీలు చేపడతామని అన్నారు. నకిలీ విత్తనాలు విక్రయించడం చట్ట రీత్యా నేరమన్నారు. ఈ సమావేశంలో జూలూరుపాడు సీఐ ఇంద్రసేనరెడ్డి, ఎస్సై జీవన్‌రాజు, హెడ్ కానిస్టేబుల్ దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం రూ.600 ఇవ్వాలి

భద్రాచలం, మే 21: ఉపాధి పని చేస్తున్న కూలీలకు కొలతలతో సంబంధం లేకుండా రోజుకూలి రూ. 600 ఇవ్వాలని, 200 రోజులు పని దినాలు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు మచ్చా వెంకటేశ్వర్లు కోరారు. భద్రాచలంలో మంగళవారం వ్యవసాయ కార్మిక సంఘం పట్టణ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వెంకటేశ్వర్లు మాట్లడుతూ కేంద్ర ప్రభుత్వం ఉపాధి పనులకు నిధుల కేటాయింపు తగ్గిస్తూ కోత విధిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గడ్డం స్వామి, ఉపాధి కూలీలు కొర్సా రమణ, కోలా గంగ, ఆదిశ్రీనివాస్, వోపాలు పాల్గొన్నారు.

కార్మికులకు వేతన బకాయిలు చెల్లించాలి

మణుగూరుటౌన్, మే 21: ఏరియాలోని పీకేఓసీ వాషింగ్ ప్లాంట్‌లో పనిచేస్తోన్న కాంట్రాక్ట్ కార్మికులకు కేంద్ర ప్రభుత్వ జీవో ప్రకారం పెరిగిన వేతన బకాయిలను వెంటనే చెల్లించాలని ఇఫ్టూ ఏరియా అధ్యక్షుడు మంగీలాల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఏరియా పర్సనల్ మేనేజర్ సింగుశ్రీనివాస్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సెంట్రల్ జీవో ప్రకారం పెరిగిన వేతన బకాయిలు చెల్లించాలని గత ఏడాదిగా డిమాండ్ చేస్తున్న ఏరియా యాజమాన్యం ఆ దిశగా చర్యలు తీసుకోవడంలేదన్నారు. జీఓలోనే వేతన బకాయిలను చెల్లించాలని స్పష్టంగా పేర్కొన్నారని, అయినప్పటికిని సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదని విమర్శించారు. ఇప్పటికైన స్పందించి వేతన బకాయిలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సామేలు, ప్రసాద్, రెబ్బలపల్లి వెంకటచారి, నాగేశ్వరరావు, కస్నా, మహర్షి, కళ్యాణ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

సెంట్రల్ లైటింగ్‌కు మోక్షం ఎన్నడు..?



దీపాలు లేక ఖాళీగా స్తంభాలు

మణుగూరురూరల్, మే 21: మణుగూరు బీటీపీఎస్‌కు చెందిన రూ.2 కోట్ల సీఎస్‌ఆర్ నిధులతో ప్రారంభించిన మణుగూరు నుంచి జానంపేట వరకు ప్రధాన రహదారిపై విద్యుత్ దీపాల ఏర్పాటు పనులు ఆరంభశూరత్వంగానే మిగిలింది. రహదారి పొడవునా చకచక పోల్స్ విద్యుత్ తీగలను వేసిన అధికారులు అంతటితోనే ఆగిపోయారు. విద్యుత్ స్థంభాలపై ఎల్‌ఈడీ బల్బులను ఏర్పాటు చేస్తామని చెప్పిన విసయాన్ని మరిపోయినట్లున్నారు. నేటికి ఆ రహదారిపై విద్యుత్ వెలుగులు పడడంలేదు. దీంతో రాత్రి సమయాల్లో పలు ప్రమాదాలు చోటు చేసుకుంటేనే ఉండగా.. పలువురు ప్రాణాలు కోల్పోగా.. పలువురు క్షతగాత్రులుగా మిగిలిన సంఘటనలు అనేకమున్నాయి. నిధులుండడంతో ఇంకేముంది రహదారిపై సెంట్రల్ లైటింగ్ వెలుగులు జిగెల్ మంటాయి అనుకున్న ప్రజల ఆశలపై అధికారులు నీరుజల్లినట్లైంది. ఈ నిధులు స్థానికంగా ఉన్నప్పటికీ పనులు చేపట్టడంలో గత ప్రభుత్వ ప్రజా ప్రతినిధులు, అధికారులు పూర్తి స్థాయిలో విఫలమయ్యారని చెప్పవచ్చు. గత ప్రభుత్వ ప్రజా ప్రతినిధుల నిర్లక్ష్యం కారణంగా నేటి వరకు ఎల్‌ఈడీ బల్బులను అమర్చలేదు. ఇప్పటికైనా నేటి ప్రజా ప్రతినిధులు, అధికారులు ఈ విషయంపై దృష్టి సారించాప్రజలు డిమాండ్ చేస్తున్నారు. తమ శాఖకు కేటాయించిన నిధులతో స్తంభాలు, వైర్లను ఏర్పాటు చేశామని ఏడీఈ జీవన్ కుమార్ తెలిపారు. త్వరలోనే ఎల్‌ఈడీ బల్బులను ఏర్పాటుచేసేందుకు చర్యలను తీసుకుంటామని ఏడీఈ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

సర్వాయిగుంపులో ప్రభుత్వ వైద్య శిబిరం

మణుగూరు, మే 21: మండలంలోని వలస ఆదివాసీ గిరిజన గ్రామమైన రేగుల గండి, సర్వాయిగుంపు గ్రామాల్లో మలేరియాపై ప్రాదథమిక ఆరోగ్య సిబ్బంది మంగళవారం సర్వేను నిర్వహించారు. అనంరతరం వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి స్థానిక ఆదివాసీ కుటుంబాలకు వైద్య సేవలందించారు. వర్షాకాలం తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపారు. మలేరియా సోకే అవకాశం ఉన్న క్రమంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. నిల్వ ఉన్న నీటిని పారబోసి దోమల వ్యాప్తి లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. పలు ఇండ్లలో డ్రమ్ముల్లో నిల్వ ఉన్న నీటిని పారబోశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఉమేష్, ఏవీ లక్ష్మి ఇందిరా, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.